హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ : 18004251442

యాదాద్రి : 1800 425 7106

సూర్యాపేట : 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 60

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.130	195	220
సూర్యాపేట	రూ.130	200	210
నల్లగొండ	రూ.125	195	210

ఉష్ణోగ్రత గరిష్ఠం 33.0 । కనిష్ఠం 19.4



పేట జిల్లా రాష్ట్ర సరిహద్దు రామాపురం వద్ద ఏర్పాటుచేసిన చెక్‌పోస్ట్



చికెన్ విక్రయాలు తగ్గాయ్

కోళ్ల వైరస్ భయంతో చికెన్ వినియోగం తగ్గింది. రాష్ట్రంలో ప్రత్యేకించి ఉమ్మడి జిల్లాలో కోళ్లకు ఎలాంటి వైరస్, వ్యాధి సోకలేదని అధికారులు స్పష్టంగా పేర్కొంటున్నా, విక్రయాల్లో తగ్గుదల నమోదైంది. ఏపీ రాష్ట్ర సరిహద్దు ప్రాంతం కావడంతో సూర్యాపేట జిల్లాలో చికెన్ విక్రయాలపై కొంత ప్రభావం ఎక్కువగా ఉండగా, నల్లగొండ, యాదాద్రి జిల్లాల్లో సగటు కంటే 20శాతం వరకు విక్రయాలు తగ్గాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కోళ్లఫాంలను పశుసంవర్ధకశాఖ అధికారులు తనిఖీ చేసి ఎక్కడా వైరస్ లక్షణాలు లేవని నిర్ధారించారు.

– (ఆంధ్రజ్యోతి ప్రతినిధి, నల్లగొండ)

- సగటున 20శాతానికిపైగా తగ్గుదల
- ఉమ్మడి నల్లగొండ జిల్లాలో వైరస్ భయంలేదంటున్న పశుసంవర్ధకశాఖ
- ప్రతీ కోళ్లఫామ్‌ను తనిఖీ చేస్తున్న అధికారులు
- నేటి నుంచి రూ.5వరకు పెరగనున్న చికెన్ ధర



ఓ వైపు చికెన్ విక్రయాలు మందగిస్తే గురువారం నుంచి చికెన్ ధర కిలోకు రూ.3 నుంచి రూ.5 వరకు పెంచేందుకు పౌల్ట్రీ సమాఖ్య నిర్ణయించింది. కోడిగుడ్ల ధరలు, విక్రయాలపై మాత్రం ఎలాంటి ప్రభావం కనిపించలేదు. విక్రయాలు, ధరలు యథావిధిగానే ఉన్నాయి. మార్కెట్లో పరిస్థితి ఇలా ఉంటే పశుసంవర్ధకశాఖ అధికారులు మాత్రం ఉమ్మడి జిల్లాలో ఎలాంటి ఇబ్బందిలేదని, చికెన్, కోడిగుడ్లను ఆహారంలో తీసుకోవచ్చని, భయపడాల్సిన పనిలేదని స్పష్టం చేశారు.

నేటి నుంచి పెరగనున్న ధరలు

ఓ వైపు ఏపీలో బర్డ్‌ఫ్లూతో చికెన్ ధరలు తగ్గుతాయనుకుంటే ఫామ్‌గేటు ధరలు మాత్రం గురువారం నుంచి పెరుగుతున్నాయి. ఈ మేరకు పౌల్ట్రీదుకాణాల నిర్వాహకులకు ఇప్పటికే సమాచారం అందింది. ప్రస్తుతం ఫామ్‌గేట్ ధర లైవ్‌బర్డ్‌కి కిలో రూ.97 ఉంటే గురువారం నుంచి రూ.100కు పెరగనుంది. అదేవిధంగా చికెన్‌ధర సైతం కిలోకి రూ.4 పెంచినట్టు చికెన్ దుకాణదారులు తెలిపారు. ప్రస్తుతం చికెన్‌ధర లైవ్‌బర్డ్ కిలో రూ.97 ఉంటే, గురువారం నుంచి రూ.100కు, చికెన్ కిలో రూ.173 నుంచి రూ.177కు, స్కిన్‌లెస్ ధరలు కిలో రూ.196 నుంచి రూ.201కి పెరుగుతాయని చెబుతున్నారు. కోడిగుడ్లు డజన్ రూ.60గానే కొనసాగుతోంది.

వైరస్ భయంతో తగ్గిన విక్రయాలు

ఏపీ రాష్ట్రంలో బర్డ్‌ఫ్లూ కారణంగా కోళ్లు చనిపోతున్నాయనే కారణంతో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో చికెన్ విక్రయాలు తగ్గాయి. ఉమ్మడి జిల్లాలోని ప్రధాన పట్టణాల్లో బుధవారం చికెన్, కోడిగుడ్ల కొనుగోళ్ల పరిస్థితిని 'ఆంధ్రజ్యోతి' క్షేత్రస్థాయిలో పరిశీలించింది. నల్లగొండలో ఒక చికెన్ దుకాణం నిర్వాహకుడు సాధారణ పరిస్థితుల్లో సగటున 100 నుంచి 130కిలోల వరకు చికెన్ విక్రయించగా, బుధవారం స్వల్పంగా తగ్గి 100 కిలోల లోపే విక్రయించినట్టు తెలిపాడు. ఏపీ సరిహద్దు ప్రాంతాలైన సూర్యాపేట, కోదాడ పట్టణాల్లో మాత్రం సగటు అమ్మకాల కంటే 25 నుంచి 30శాతం మేర విక్రయాలు తగ్గాయి. సూర్యాపేట పట్టణంలో సుమారు 150 వరకు చికెన్ దుకాణాలుంటే, అందులో బుధవారం 40 దుకాణాల వరకు స్వచ్ఛందంగా మూసివేశారు. నల్లగొండ, భువనగిరి జిల్లాల్లో మాత్రం ఈవ్యాధి ప్రభావంతో కొనుగోళ్లు 20శాతం మేర మందగించినా దుకాణాలన్నీ యథావిధిగానే కొనసాగాయి..

- మిగతా 6వ పేజీలో...



సరిహద్దులో కోళ్ల రవాణా వాహనాల తనిఖీ

(ఆంధ్రజ్యోతి, కోదాడ రూరల్, నాగార్జునసాగర్, మిర్యాలగూడ రూరల్): ఏపీ రాష్ట్రంలో కోళ్లకు బర్డ్‌ఫ్లూ నేపథ్యంలో బుధవారం కోదాడ మండలం రామాపురం క్రాస్‌రోడ్డు చెక్‌పోస్టు వద్ద ఏపీ నుంచి వచ్చే కోళ్ల వాహనాలను తనిఖీ చేసి తిప్పి పంపించారు. బర్డ్‌ఫ్లూ వైరస్ వ్యాప్తికి వాహనాలు కూడా కారణం అవుతాయని, వాటిని శానిటైజ్ చేయాలని ఏవైనా కోళ్లు మృతిచెందితే గుంత తీసి, సున్నం పోసి పూడ్చాలని, కాల్వలో, ఆరుబయట ప్రాంతాల్లో పడేయకూడదని సూర్యాపేట జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి శ్రీనివాసరావు తెలిపారు. నాగార్జునసాగర్ పైలాన్ కాలనీ కొత్త వంతెన వద్ద పోలీస్, అటవీశాఖ, పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో చెక్‌పోస్టును ఏర్పాటు చేశారు. ఇక్కడ అధికారులు మూడు షిఫ్టులుగా 24 గంటలు విధులు నిర్వహిస్తున్నారు. ఇక్కడ వెటర్నరీ డాక్టర్ కేశవ్ అజ్మీరా, అటవీ శాఖ అధికారి రవీందర్ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహిస్తున్నారు. అదేవిధంగా మిర్యాలగూడ మండలంలోని అవంతీపురం, సుబ్బారెడ్డిగూడెం, రాయినిపాలెం గ్రామాల్లోని కోళ్ల ఫామ్‌లను పశుసంవర్ధశాఖ అధికారి దుర్గారమాదేవి ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు.

బీర్ల ధరలు పెరిగాయ్

- రూ.30 నుంచి రూ.40 వరకు పెంపు
- మద్యం ప్రియులపై రూ.4.60కోట్ల అదనపు భారం
- అమలులోకి వచ్చిన నూతన ధరలు

సూర్యాపేటక్రైం, ఫిబ్రవరి 12, (ఆంధ్రజ్యోతి): ఎండాకాలంలో బీరు ప్రియులకు గట్టి దెబ్బ తగిలింది. సాధారణంగా వేసవి కాలంలో ఎక్కువగా చాలా మంది మద్యం ప్రియులు బీర్లు తాగుతుంటారు. సాధారణ రోజుల్లో మద్యం తీసుకునేవారు వేసవిలో మాత్రం బీర్లతో ఎండ తాపం నుంచి తాత్కాలిక ఉపశమనం పొందుతుంటారు. కాగా, ప్రభుత్వం తాజాగా బీర్ల ధరలు పెంచి వారిపై అదనపు భారాన్ని మోపింది. దీంతో ఒక్కో బీరు ధర కనిష్ఠంగా రూ.30 నుంచి గరిష్ఠంగా రూ.40 వరకు పెరిగింది. దీంతో ఎక్కువగా బీర్లు ఇష్టపడేవారిపై అదనపు ఆర్థిక భారం పడనుంది. ప్రభుత్వం పెంచిన బీర్ల ధరలు ఇప్పటికే అమలులోకి వచ్చాయి.

అమలులోకి నూతన ధరలు

ప్రభుత్వం పెంచిన బీర్ల ధరలు అమలులోకి వచ్చాయి. ఇప్పటికే మద్యం డిపోల్లో ఉన్న పాత స్టాక్‌ను కూడా పెంచిన ధరల ప్రకారం విక్రయించాలని ప్రభుత్వం ఆదేశించింది. మద్యం దుకాణాలకు కూడా బీరు



బాటిళ్లపై పాత ఎంఆర్‌పీ ధర ఉన్నా, వారి నుంచి ప్రభుత్వం పెంచిన ధరల ప్రకారం డబ్బు వసూలు చేయనుంది. దీంతో పాత స్టాక్‌ను కూడా నూతన ధరలకు విక్రయించాలని ఆదేశించింది. పెరిగిన ధరల ప్రకారం కింగ్‌ఫిషర్ లైట్ బీరు రూ.180, కింగ్ ఫిషర్ స్ట్రాంగ్ బీరు రూ.190, కింగ్‌ఫిషర్ అల్ట్రా బీరు ధర రూ.250, బడ్‌వైజర్ మాగ్నమ్ బీరు ధర రూ.260, గ్రీన్‌డీర్ బీరు ధర రూ.180, రాయల్ చాలెంజ్ బీరు రూ.180, నాకవుట్ బీరు రూ.190, బడ్‌వైజర్ లైట్ బీరు..

- మిగతా 6వ పేజీలో...

పెరిగిన ధరల ప్రకారం విక్రయించాలి



జిల్లాలో ప్రభుత్వం పెంచిన ధర ప్రకారం బీర్లను విక్రయించాలి. పాత స్టాక్‌ను కూడా నూతన ధరలకు విక్రయించాలి. విస్కీ ధరలు మాత్రం పెరగలేదు. ఎవరైనా విస్కీని అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటాం. బీరు బాటిళ్లపై పాత ఎమ్మార్పీ ఉన్నా పెరిగిన ధరల ప్రకారం విక్రయాలు జరుగుతాయి. నిబంధనలు పాటించి మద్యం విక్రయాలు చేయాలి.


- లక్ష్మానాయక్, సూర్యాపేట ఈఎస్



17 ఏళ్ల నిరీక్షణకు తెర

- ఫలించిన డీఎస్సీ-2008 అభ్యర్థుల ఆశలు
- ఉమ్మడి జిల్లాలో 158 మందికి ఉపాధ్యాయ ఉద్యోగాలు
- నేడో, రేపో నియామక ఉత్తర్వులు
- ప్రస్తుతానికి మూలవేతనమే.. ఇతర అలవెన్సులు లేవు

●6లో..



కందులు కొనేవారేరీ?

- మోత్కూరులో కొనుగోలు కేంద్రం తెరిచి 17 రోజులు
- ఇప్పటివరకు బస్తా కొనుగోలు చేయని వైనం
- మార్కెట్ బ్యానర్ తొలగించి రైతుల నిరసన
- తిరుమలగిరి మార్కెట్‌కు వెళ్తున్న రైతులు

●7లో..

పునరావాసం కల్పించాలని పనుల అడ్డగింత



నర్సిరెడ్డి గూడెం భూ నిర్వాసితులతో మాట్లాడుతున్న సీఐ నవీన్ కుమార్

మర్రిగూడ, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): పునరావాసం, ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ అందించాలని భూ నిర్వాసితులు డిమాండ్ చేశారు. మర్రిగూడ మండలంలోని చర్లగూడెం రిజర్వాయర్ పనులను బుధవారం చర్లగూడ ముంపు గ్రామ బాధితులైన నర్సిరెడ్డిగూడెం నిర్వాసితులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ నెలరోజుల అనంతరం పునరావాసం,ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ రాని వారికి అన్ని కల్పిస్తామని చెప్పారని,కాని ఇప్పటివరకు తమకు పునరావాసానికి సంబంధించిన ధ్రువపత్రాలు అందించలేదని అన్నారు.

అందుకే పనులను అడ్డుకున్నట్టు బాధితులు పేర్కొన్నారు. విషయం తెలుసుకున్న సీఐ నవీన్‌కుమార్, ఎస్‌ఐ కృష్ణారెడ్డి సంఘటనా స్థలానికి చేరుకొని భూనిర్వాసితుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మీకు తప్పనిసరిగా పునరావాసం, ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ వస్తుందని, పనులకు సహకరించాలని బాధితులకు నచ్చజెప్పా రు. అయినా బాధితులు వినకుండా వారు పనులు అడ్డుకున్నారు. అనంతరం సీఐ నవీన్‌కుమార్ హామీతో పనులు జరగడానికి బాధితులు సహకరించారు.

మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలి

ఐసీడీఎస్ పీడీ కృష్ణవేణి

మునుగోడురూరల్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): మెనూ ప్రకారం పిల్లలకు పౌష్టికాహారం అందించాలని, అంగన్‌వాడీ కేంద్రాల్లో టీచర్లు లేకపోతే చర్యలు తప్పవని ఐసీడీఎస్ పీడీ కృష్ణవేణి హెచ్చరించారు. మండలంలోని చీకటిమామిడి అంగన్‌వాడీ కేంద్రాన్ని మంగళవారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్రాల్లో నిర్లక్ష్యంగా వ్యహరిస్తే కఠినచర్యలు తప్పవని అన్నారు. ప్రీస్కూల్ పిల్లల తల్లిదండ్రులక కౌన్సిలింగ్ ఇచ్చి పిల్లలందరూ అంగన్‌వాడీ కేంద్రానికి హాజరయ్యేలా చూడాలన్నారు. మెనూ ప్రకారం వంట చేశారా? లేదా? అని తెలుసుకున్నారు. బియ్యం, పప్పు, గుడ్ల నాణ్యతను తనిఖీ చేశారు. పిల్లలకు అందించే బాలామృతం ప్లస్ తినిపిస్తున్నారా లేదా అని టీచర్‌ను అడిగి తెలుసుకున్నారు. అన్ని అంగన్‌వాడీ కేంద్రాల పరిసరాలు, పరిశుభ్రంగా ఉండాలని అన్నారు. అనంతరం టీచర్లకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఏసీడీపీవో వెంకటమ్మ, సూపర్‌వైజర్లు యాదమ్మ ఉన్నారు.

పూర్వగిరీశుడికి శ్రీపుష్పయాగం

●7లో..

ఇందిరమ్మ ఇంటి మోడల్ నిర్మించాలి

కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ టౌన్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు అవగాహన కల్పించేందుకు పట్టణాలు, మండల కేంద్రాల్లో ఇందిరమ్మ ఇళ్ల మోడల్ నిర్మించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. కలెక్టర్ కార్యాలయ ఆవరణలో నిర్మిస్తున్న ఇందిరమ్మ మోడల్ ఇంటిని ఆమె బుధవారం పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ, కలెక్టరేట్‌లో నిర్మించిన ఇందిరమ్మ మోడల్ ఇల్లు బాగుందని, ఇదేవిధంగా జిల్లా వ్యాప్తంగా అన్ని మండల కేంద్రాలు, ముఖ్యమైన పట్టణాల్లో ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఇలాంటి మోడల్ ఇళ్లు నిర్మించాలన్నారు. కార్యక్రమంలో గృహ నిర్మాణశాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ రాజ్‌కుమార్, సర్వే ల్యాండ్ రికార్డ్స్ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

విధుల పట్ల అలసత్వం వహిస్తే కఠిన చర్యలు

గుర్రంపోడు: ప్రాథమిక వైద్య, ఆరోగ్య కేంద్రాలను సరైన విధంగా నిర్వహించాలని లేదంటే చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఇలా త్రిపాఠి హెచ్చరించారు. గుర్రంపోడు ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె ఆస్పత్రి సిబ్బంది రిజిస్టర్, మందులను పరిశీలించి రికార్డులు సరిగా లేకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. అంతేకాక కలెక్టర్ ఆస్పత్రిలో పనిచేస్తున్న నర్సు నాగరాణిని అడిగిన ప్రశ్నలకు సరైన సమాధానం ఇవ్వకపోవడం, స్టాఫ్ వివరాలు సరిగా లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నర్సు నాగమణికి షోకాజ్ నోటీస్ జారీ చేయాలని ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా పీహెచ్‌సీలను సరిగా నిర్వహించాలని లేకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. ఆస్పత్రుల్లో సాధారణ ప్రసవాలు పెంచాలని, మాతాశిశు మరణాల సంఖ్య తగ్గించాలని, అన్ని రకాల మందులు, వ్యాక్సిన్‌ను సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. ఆమె వెంట తహసీల్దార్ ఫరీదుద్దీన్, ఆర్‌ఐ నజీర్ ఉన్నారు.



కలెక్టరేట్‌లో ఇందిరమ్మ ఇంటి మోడల్ పరిశీలిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

ఉద్యానవన పంటలను ప్రోత్సహించాలి

కొండమల్లేపల్లి: నూతన ఉద్యానవన పంటలను ప్రోత్సహించే దిశగా పరిశోధనలు సాగాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని ఉద్యాన వన పరిశోధన కేంద్రాన్ని ఆమె సందర్శించారు. రాళ్ల, రప్పలు ఉన్న ప్రాంతాల్లో కుంకుడు పంటలను ప్రోత్సహించాలని సూచించారు. జిల్లాలో 4300 ఎకరాల్లో బత్తాయి, 9వేల ఎకరాల్లో నిమ్మ తోటలు పటలు సాగుచేస్తున్నారని అన్నారు. మెరుగైన దిగుబడులు వచ్చేలా రైతులకు మంచి మొక్కలను అందించే విధంగా పరిశోధనల సాగాలని అభిప్రాయపడ్డారు. అంతకుముందు పరిశోధన కేంద్రం ద్వారా ఇస్తున్న శిక్షణ కార్యక్రమాలు, ఉద్యానవన కేంద్రంలో బత్తాయి, నిమ్మ పంటలకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. నర్సరీని పెంచేందుకు ప్రభుత్వానికి రూ.25లక్షలతో ప్రతిపాదనలు పంపించాలని ఆమె సూచించారు. కలెక్టర్ వెంట జిల్లా ఉద్యానవనశాఖ సహాయ సంచాలకుడు సాయిబాబా, సీనియర్ సైంటిస్ట్ రాజుగౌడ్, ట్రైనింగ్ కోఆర్డినేటర్ లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

వికసిత్ భారత్ లక్ష్యంగా బడ్జెట్



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న నాగం వర్షిత్‌రెడ్డి

బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి

నల్లగొండటౌన్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): వికసిత్ భారత్ లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం రూ.50లక్షల కోట్లతో బడ్జెట్‌ను ప్రవేశపెట్టిందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నాగం వర్షిత్‌రెడ్డి అన్నారు. బుధవారం బీజేపీ జిల్లా కార్యాలయం లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బడ్జెట్‌లో రూ.12లక్షల వరకు ఆదాయపన్ను రిబేట్ ఇవ్వడం అల్పాదాయ వర్గాలకు గొప్ప ఊరట కలిగించిందన్నారు. కేంద్ర బడ్జెట్‌పై దేశ ప్రజలు సంతోషంగా ఉన్నారని, దీనికి ఢిల్లీ ఎన్నికల్లో గెలుపే నిదర్శనమన్నారు. కిసాన్ క్రెడిట్ కార్డుల ద్వారా రైతుల రుణాల పరిమితిని రూ.3 లక్షల నుంచి రూ.5లక్షలకు పెం చిందని, పప్పు ధాన్యాల కోసం రూ.1,000 కోట్లు కేటాయించిందని, రాష్ట్రంలో పసుపు బోర్డును ఏర్పాటు చేసిందన్నారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి రూ.2.65లక్షల కోట్లు, ఉపాధి హామీకి రూ.88వేల కోట్లు, తాగునీటి వ్యవస్థకు రూ.67వేల కోట్లు కేంద్రం కేటాయించిందన్నారు. రాష్ట్రంలోని ప్రతి పల్లెకు కేంద్రంలోని మోదీ ప్రభుత్వ నిధులు అందుతున్నాయని, రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నుంచి ఒక్క రూపాయి కూడా రావడం లేదన్నారు. అర్హులైన ప్రతీ పేదవాడికి ఇల్లు కట్టించి ఇవ్వాలనే సంకల్పంతో కేంద్ర ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి జిల్లాకు చేసింది ఏమీ లేదని విమర్శించారు. పార్టీలో ఎంతోమంది సీనియర్లు ఉన్నారని, ఆశావహులు ఎక్కువగా ఉన్నప్పుడు స్వల్ప అసంతృప్తి సహజమని, జిల్లాలో తలెత్తిన అసంతృప్తిపై రాష్ట్ర నాయకత్వం మాట్లాడుతుందన్నారు. త్వరలోనే సమస్య సద్దుమణుగుతుందని పేర్కొన్నారు. సమావేశంలో బీజేపీ దళితమోర్చా రాష్ట్ర నాయకుడు చింతా ముత్యాలరావు, మైనార్టీ మోర్చా నాయకుడు షేక్ బాబా, ఓబీసీ మోర్చా నాయకుడు పాలకూరి రవిగౌడ్, జిల్లా నాయకులు కంచర్ల విద్యాసాగర్‌రెడ్డి, పోతేపాక లింగస్వామి, దాసోజు యాదగిరిచారి, రమణముదిరాజ్, మంగలపల్లి కిషన్, మోహన్‌రెడ్డి, లకడాపురం వెంకటేశ్వర్లు, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

సాంకేతిక పద్ధతులను అవలంబించాలి



ఫార్మర్స్ రైతు ప్రొడ్యూసర్స్ కంపెనీలో విదేశీ ప్రతినిధులు

కట్టంగూరు, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): రైతులు ఆధునిక సాంకేతిక పద్ధతులను ఉపయోగించి ఆర్థికంగా అభివృద్ధి చెందాలని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అగ్రికల్చరల్ ఎక్స్‌టెన్షన్ మేనేజ్‌మెంట్ ప్రతినిధులు అన్నారు. మండంలోని అయిటిపాముల జీపీ పరిధి గంగాదేవిగూడెం సమీపంలో ఉన్న కట్టంగూరు ఫార్మర్స్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ మేనేజ్ సంస్థ ప్రతినిధులు, దక్షిణఅమెరికా, దక్షిణాఫ్రికా, దక్షిణఆసియా దేశాల ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎఫ్‌పీవో సిబ్బంది నిమ్మ గ్రేడింగ్ యంత్రాన్ని, నిమ్మ ఒరుగుల తయారీ యంత్రాన్ని, పలు రకాల వ్యవసాయ పనిముట్లు, సోలార్ కోల్ట్ స్టోరేజీని, కూరగాయల మార్కెటింగ్ విధానం, ఎరువులు, పురుగుల మందు కొనుగోలు విధానాన్ని, నిమ్మకాయ పచ్చడి తయారీ, ప్యాకింగ్, నిమ్మకాయ జ్యూస్ గురించి ప్రతినిధులకు వివరించారు. తపోవనం ఆర్గానిక్ ఫార్మింగ్ సిస్టం ప్రైవేట్ లిమిటెడ్ బెంగుళూరుకు చెందిన శాస్త్రవేత్తలు పత్తి కట్టెల తో బయోచార్ విధానం ద్వారా పంట పొలాలను కర్బనశాతం పెంచుకోవచ్చని రైతులకు తెలిపారు. మహిళలకు ప్రతీక్ ఫౌండేషన్ సహకారంతో స్వచ్ఛశక్తి ఆఫ్ గ్రేడ్ సోలార్ పవర్ ప్రొడక్షన్ ప్లాంట్లు ఏర్పాటు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో నాబార్డు డీడీఎం వినయ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే నంద్యాల నర్సింహారెడ్డి, ఎఫ్‌పీవో చైర్మన్ చెవుగోని సైదమ్మ, ఐఆర్‌డీఎస్ చైర్మన్ వాడేపల్లి రమేష్, సీఈవో నరేష్, డైరెక్టర్లు పాల్గొన్నారు.

నైపుణ్యమే పెట్టుబడి

● వృత్తి నైపుణ్య శిక్షణే ఉపాధి సాధనకు రాజమార్గం ● మూడు నెలల కోర్సుతో ఆర్థికంగా ముందుకు..



టైలరింగ్‌లో శిక్షణ పొందుతున్న మహిళలు



డ్రెస్ కటింగ్ నేర్పుతున్న శిక్షకురాలు



వృత్తి నైపుణ్య శిక్షణ ఎంతో మందికి ఉపాధిని చూపుతోంది. ఖాళీ సమయంలో వారు నేర్చుకున్న శిక్షణ ఆర్థికంగా ముందుకు సాగేందుకు దారి చూపుతోంది. ఈ శిక్షణ ద్వారా మెలకువలు నేర్చుకుంటూ పలు కంపెనీలు నిర్వహించే జాబ్‌మేళాల ద్వారా కంపెనీల ఉద్యోగాలకు ఎంపికవుతున్నారు.

(ఆంధ్రజ్యోతి-యాదగిరిగుట్ట రూరల్)

గ్రామీణ ప్రాంతాల్లోని నిరుద్యోగులు, ఆర్థిక ఇబ్బందులతో చదువును మధ్యలో ఆపేసిన గృహిణులు, యువత కోసం ప్రభుత్వం యాదగిరిగుట్ట పట్టణంలో 2019 సంవత్సరంలో వృతి నైపుణ్య శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. ఈ కేంద్రంలో కంప్యూటర్ (ఎమ్మెస్ ఆఫీస్), బ్యుటీషియన్, టైలరింగ్ కోర్సులను రూ.1500 ఫీజులతో, మూడు నెలల వ్యవధిలో నేర్పిస్తున్నారు. ఇప్పటివరకు ఆయా కోర్సుల్లో సుమారు వెయ్యికి పైగా శిక్షణ పొంది వివిధ రంగాల్లో స్థిరపడ్డారు. పలువురు స్వయంగా దుకాణాలు ఏర్పాటు చేసుకొని ఉపాధి పొందుతున్నారు.

ఉపాధితో కొత్త జీవితం



ఇక్కడ శిక్షణ పొందిన వారు ఉపాధితో కొత్త జీవితానికి పునాదులు వేసుకుంటున్నారు. విభిన్న వయస్సుల వారు శిక్షణ ఇస్తుండడం ఆనందంగా ఉంది. ప్రభుత్వం కల్పించే ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి.

బూడిద రాజశేఖర్, కంప్యూటర్ ఫ్యాకల్టీ

మహిళలు ఆర్థికంగా ఎదుగుతున్నారు



స్థానిక వృత్తి నైపుణ్య శిక్షణ కేంద్రంలో ఇప్పటివరకు 360 మంది మహిళలకు శిక్షణ ఇచ్చాం. అందులో కొంతమంది స్వయం ఉపాధిలో సొంతంగా బ్యూటీపార్లర్ ఏర్పాటు చేసుకొని ఆర్థికంగా లబ్ధి పొందుతున్నారు. వారి కుటుంబాలను పోషించుకుంటున్నారు.

రేణుక, బ్యుటీషియన్, ఫ్యాకల్టీ

టైలరింగ్‌తో కుటుంబాన్ని పోషిస్తున్నా



స్థానిక వృత్తి నైపుణ్య శిక్షణ కేంద్రంలో నామమాత్రం ఫీజుతో మూడు నెలల్లో టైలరింగ్ శిక్షణ పూర్తి చేసుకొని ఇంటివద్ద టైలరింగ్ దుకాణం ఏర్పాటు చేసుకొని కుటుంబాన్ని పోషిస్తున్నా. నా భర్త సంపాదనకు నా సంపాదన తోడు కావడంతో ఆర్థిక ఇబ్బందులు లేకుండా జీవితం సాఫీగా సాగుతోంది.

లావణ్య, యాదగిరిగుట్ట

మా గ్రామంలో పార్లర్ నిర్వహిస్తా



శిక్షణ కేంద్రంలో నే బ్యుటీషియన్‌లో శిక్షణ పొంది మా గ్రామంలో బ్యూటీపార్లర్ ఏర్పాటు చేస్తా. ఈ శిక్షణలో మెహిందీ, వెన్న, ఫేషియల్, ఐబ్రోస్ తదితర శిక్షణ పొందుతున్నా.

ప్రణీత, రాఘవాపురం

అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి



రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ యువతీ యువకులు, మహిళలు, నిరుదోగ్యులకు వృత్తి నైపుణ్య శిక్షణ కేంద్రం ద్వారా ఉపాధి అవకాశాలు కల్పిస్తోంది. స్వయం ఉపాధి కోసం బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించి వారు ఆర్థికంగా ఎదిగేందుకు కృషి చేస్తున్నాం. ఈ శిక్షణ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి.

ధనుంజయ్య, డీవైఎస్‌వో, యాదగిరిగుట్ట

17ఏళ్ల నిరీక్షణకు తెర

● ఉపాధ్యాయ అభ్యర్థులకు అండగా నిలిచిన హైకోర్టు
● ఫలించిన డీఎస్సీ-2008 అభ్యర్థుల ఆశలు
● ఉమ్మడి జిల్లాలో 158 మందికి ఉపాధ్యాయ ఉద్యోగాలు
● నేడో, రేపో నియామక ఉత్తర్వులు



భువనగిరి టౌన్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): డీఎస్సీ-2008 అభ్యర్థుల సుదీర్ఘ పోరాటాలకు, నిరీక్షణకు హైకోర్టు అండతో తెరపడనుంది. 17 ఏళ్ల ప్రభుత్వ ఉపాధ్యాయ ఉద్యోగం కల నెరవేరబోతోంది. మిగతా రెగ్యులర్ ఉపాధ్యాయుల వేతనాలతో పోలిస్తే వేతనాలు తక్కువగా ఉన్నా, ప్రభుత్వ ఉద్యోగ భద్రత లభిస్తుండటంతో సుమారు 40 ఏళ్లు దాటిన అభ్యర్థులందరిలో ఆనందం వెల్లువెరుస్తోంది. హైకోర్టు ఆదేశాలతో రాష్ట్ర విద్యాశాఖ నేడో, రేపో ఉద్యోగ నియామక పత్రాలను అందజేయనుంది. దీంతో ఉమ్మడి జిల్లాలో 2008లో డీఎస్సీ రాసిన 158 మంది అభ్యర్థులకు కాంట్రాక్ట్ ఉపాధ్యాయ ఉద్యోగాలు రానున్నాయి. నియామక పత్రాలు జారీ అయిన వెంటనే జిల్లా విద్యాశాఖ కేటాయించే పోస్టులలో నూతన ఉపాధ్యాయులు విధుల్లో చేరనున్నారు. ఇటీవల డీఎస్సీ 2024తో జరిగిన నియామకాలతోపాటు తాజాగా 2008 డీఎస్సీ అభ్యర్థులు విధుల్లో చేరనుండటంతో ఉపాధ్యాయుల కొరత తీరి విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందే అవకాశాలు మెరుగయ్యాయి.

ఫలించిన పోరాటం

ఉద్యోగంకోసం 17 ఏళ్లుగా చేస్తున్న డీఎస్సీ 2008 బ్యాచ్ అభ్యర్థుల పోరాటం హైకోర్టు అండతో ఫలించింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన డీఎస్సీ 2008లో అప్పటి పలువురు బీఈడీ అభ్యర్థులు ఎస్జీటీలుగా ఎంపికయ్యారు. దీంతో వీరి నియామకాలను సవాల్‌చేస్తూ డీఈడీ అభ్యర్థులు కోర్టును ఆశ్రయించడంతో నియామకాలు ఆగిపోయాయి. దీంతో అప్పటినుంచి అభ్యర్థులు న్యాయ పోరాటాలతోపాటు ఆందోళనలు, ఉద్యమాలు చేపడుతూనే ఉన్నారు. ప్రభుత్వాలు, నాయకులు, అధికారుల చుట్టూ తిరుగుతున్నప్పటికీ హామీలకే పరిమితమయ్యారు. ఈ క్రమంలో రాష్ట్ర విభజన అనంతరం ఆంధ్రప్రదేశ్‌లో నాలుగేళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం డీఎస్సీ 2008 అభ్యర్థులకు ఉద్యోగాలను ఇచ్చింది. దీంతో తెలంగాణ అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించడంతో వెంటనే అర్హులైన 2008 బ్యాచ్ అభ్యర్థులందరికీ ఉపాధ్యాయ ఉద్యోగాలు ఇవ్వాలని హైకోర్టు ప్రభుత్వాన్ని ఆదేశించింది. దీంతో రాష్ట్రంలో 1,382 మందికి, ఉమ్మడి జిల్లాలో 158మందికి ఉద్యోగాలు ఖరారయ్యాయి.

361మందికి గాను 158మందికే..

2008 డీఎస్సీ వివాదం నెలకొన్నప్పుడు ఉమ్మడి జిల్లా నుంచి 361 మంది బీఈడీ అభ్యర్థులు ఎస్జీటీ పోస్టులకు అర్హత సాధించారు. కానీ సుదీర్ఘ పోరాటాలతోపాటు పలువురు ఇతర ఉద్యోగాలకు వెళ్లడం, వివాహాలు, తదితర కారణాలతో ఇతర ప్రాంతాల్లో స్థిరపడడం, తక్కువ వేతనం తదితర కారణాలతో గత సెప్టెంబరు 27నుంచి అక్టోబరు 7వరకు నిర్వహించిన సర్టిఫికెట్ల ధ్రువీకరణకు ఉమ్మడి జిల్లాలో 160మంది మాత్రమే హాజరు కాగా ఇద్దరిని అనర్హులుగా పేర్కొంటూ 158 మందిని ఎంపికచేశారు. కాగా ఇటీవల 2024తోపాటు సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులతో పోలిస్తే 2008 బ్యాచ్ అభ్యర్థులకు తక్కువ వేతనం లభించనుంది. ఎస్జీటీలకు ఇచ్చే మూల వేతనం రూ.31వేలు వేతనంగా లభించనుంది. అలాగే ప్రస్తుతానికైతే హెచ్‌ఆర్‌ఏ తదితర అలవెన్సులు వర్తించవని విద్యాశాఖ పేర్కొంటున్నది.

న్యాయం జరిగింది



17 ఏళ్ల న్యాయ పోరాటం ఫలించింది. హైకోర్టు తీవ్ర మందలింపులతో మాకు న్యాయం జరిగింది. వేతనం తక్కువగా లభించనున్నప్పటికీ ప్రభుత్వ ఉద్యోగులుగా లభించే గౌరవం తృప్తినిస్తుంది. మిగతా రెగ్యులర్ ఉపాధ్యాయులతో సమానంగా విధులు నిర్వహిస్తు విద్యార్థులకు న్యాయం చేస్తాం. మా ఉద్యోగ ఆకాంక్షలను నెరవేర్చిన హైకోర్టు, ప్రభుత్వానికి, అధికారులకు కృతజ్ఞతలు.

తాడూరి బాలకృష్ణ , జిల్లా అధ్యక్షుడు, ఎస్జీటీ-2008 పోరాట సమితి యాదాద్రి భువనగిరి జిల్లా

చికెన్ విక్రయాలు తగ్గాయ్

(5వపేజీ తరువాయి)

దేవరకొండ పట్టణంలో కూడా చికెన్ విక్రయాలు మందగించాయి. పట్టణానికి చెందిన ఓ చికెన్ దుకాణం నిర్వాహకుడు సాధారణ రోజుల్లో 150 కిలోల చికెన్ విక్రయించగా, బుధవారం 80కిలోలకు మించి విక్రయించలేదని తెలిపాడు. కోడిగుడ్ల విక్రయాల్లో మాత్రం ఎలాంటి తగ్గుదల లేదని, సాధారణ రోజుల్లాగే విక్రయాలు సాగాయని దుకాణాల నిర్వాహకుడు తెలిపాడు.

వ్యాధి ప్రభావం లేదంటున్న పశుసంవర్ధకశాఖ అధికారులు



నల్లగొండ జిల్లా కనగల్ మండలంలోని కోళ్ల ఫారంలో తనిఖీలు నిర్వహిస్తున్న పశుసంవర్ధకశాఖ వైద్యుడు

ఏపీలోని కృష్ణా, గోదావరి జిల్లాల్లో కోళ్లఫాముల్లో ప్రబలిన వ్యాధి రాష్ట్రంలో ఎక్కడా నమోదవలేదని పశుసంవర్ధకశాఖ అధికారులు స్పష్టం చేస్తున్నారు. ఏపీ నుంచి రాష్ట్రంలోకి కోళ్లు రాకుండా పూర్తి కట్టుదిట్టం చేశారు. రాష్ట్రం నుంచే ఏపీకి కోళ్లు ఎగుమతి అవుతున్నాయి. ముఖ్యమంత్రి కార్యాలయ ఆదేశాలతో రాష్ట్రంలోని పౌల్ట్రీ రైతులు, హ్యాచరీస్ నిర్వాహకులతో పశుసంవర్ధకశాఖ ఉన్నతాధికారులు సమీక్ష నిర్వహించడమేగాక, అన్ని జిల్లాల్లో కోళ్లఫారాలను పశుసంవర్ధక శాఖ అధికారులు తనిఖీలు చేశారు. కోళ్లకు రక్త పరీక్షలు కూడా నిర్వహించారు. ప్రస్తుత వాతావరణం అతి చలి నుంచి వేడిగా మారుతున్న సందర్భంలో కోళ్లకు ఒత్తిడి ఏర్పడి కొంతమేర నష్టం వాటిల్లుతోందని, రాష్ట్రంలో అంతకుమించి ఎలాంటి ఇబ్బంది లేదని పశుసంవర్ధక శాఖ అధికారులు తెలిపారు. రాష్ట్రంలో 5,400 కోళ్లఫామ్‌లకు ఇప్పటికే 3,500 ఫామ్‌లలో తనిఖీలు పూర్తిచేయగా, ఒక్క పాజిటివ్ కేసు కూడా నమోదవలేదని తెలిపారు. ఉమ్మడి జిల్లాలో సైతం కోళ్లఫాముల్లో ఎక్కడా వ్యాధికారక లక్షణాలు కన్పించలేదని, కోళ్ల మరణాలు సంభవించలేదని అధికారులు స్పష్టం చేశారు. కోళ్లకు వైరస్, లేక వ్యాధి సోకితే కేవలం ఐదురోజుల్లో ఫామ్‌లోని కోళ్లన్నీ చనిపోతాయని, రైతులెవరూ వ్యాధి, వైరస్ లక్షణాలు కనిపిస్తే దాచకుండా కఠినమైన ఆదేశాలిచ్చామని, పశుసంవర్ధకశాఖ అధికారులు, వైద్యులు వారి పరిధిలోని అన్ని కోళ్లఫామ్‌లను నిత్యం తనిఖీచేస్తున్నారని ఉన్నతాధికారులు చెబుతున్నారు. ఒక్క కోడికి వ్యాధి సోకినా ఆ ఫామ్ కిలోమీటర్ పరిధి వరకు ప్రభావిత ప్రాంతంగా ప్రకటించి ఆ పరిధిలోని కోళ్లన్నింటినీ నిర్మూలిస్తారని, మరో పదికిలోమీటర్ల పరిధి వరకు స్క్రీనింగ్ నిర్వహించి కట్టుదిట్ట చర్యలు చేపడతామని ఇప్పటివరకు రాష్ట్రంలో ఎక్కడా ఆ పరిస్థితి రాలేదని పేర్కొంటున్నారు.

చికెన్‌ను నిరభ్యంతరంగా తినవచ్చు

జిల్లాలో కోళ్లకు ఎలాంటి వ్యాధి, వైరస్ నమోదవలేదు. ఏ ఒక్క ఫామ్‌లో ఒక్క కోడి కూడా ఈ వైరస్ ప్రభావంతో చనిపోలేదు. మేం జిల్లాలో అన్ని ఫామ్‌లను తనిఖీ చేసి పరీక్షలు నిర్వహించాం. కోళ్లన్నీ ఆరోగ్యకరంగానే ఉన్నాయి. ఏపీ నుంచి మన జిల్లాకు కోళ్లు రాకుండా సరిహద్దుల వద్ద చెక్‌పోస్టులు ఏర్పాటు చేశాం. సాధారణంగా మన జిల్లాకు కోళ్లు వచ్చే రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లోనూ వైరస్, వ్యాధి లక్షణాలేవీ కనిపించలేదు. వీటన్నింటినీ పరిశీలించిన పిదప జిల్లాలో చికెన్, కోడిగుడ్లను ఆహారంగా అభ్యంతరం లేకుండా తీసుకోవచ్చు. ఎవ్వరూ భయపడాల్సిన పనిలేదు. కోళ్లఫామ్‌లపై నిరంతర నిఘా కొనసాగిస్తున్నాం.

ఎండీ.ఖాద్రి, పశుసంవర్థకశాఖ జేడీ, నల్లగొండ జిల్లా

బీర్ల ధరలు పెరిగాయ్

(5వ పేజీ తరువాయి)



రూ.250, హెనెకెన్ బీరు ధర రూ.270కు చేరింది.

సూర్యాపేట జిల్లాలో..

సూర్యాపేట జిల్లా పరిధిలో 99 వైన్సులు, 20 బార్ అండ్ రెస్టారెంట్లు ఉన్నాయి. మద్యం దుకాణాల్లో ఏటా వివిధ కంపెనీలకు చెందిన సుమారు 1.13లక్షల కాటన్ల విస్కీ, 1.30లక్షల కాటన్ల బీర్లు విక్రయాలు జరుగుతున్నాయి. ప్రభుత్వం తాజాగా బీర్ల ధరల పెంపుతో మందుబాబులపై ఆర్థికభారం పడనుంది. ఒక్కో బీరుపై ప్రస్తుతం ఉన్న ధరపై 15శాతం పెంచింది. దీంతో ఒక్కో బీరుపై రూ.30 నుంచి రూ.40 వరకు ధరలు పెరిగాయి. దీంతో ఏడాదిలో పెరిగిన బీర్ల మేరకు అదనంగా రూ.4.68కోట్ల భారం బీరు ప్రియులపై పడనుంది.

ప్రేమ పేరుతో వేధించిన యువకుడి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న హుజూర్‌నగర్ ఎస్ఐ ముత్తయ్య

హుజూర్‌నగర్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): యువతిపై పెట్రోలు పోసి హత్యాయత్నానికి ప్రయత్నించిన యువకుడిని పోలీసులు అరెస్టు చేశారు. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ సమీపంలో అనుమానస్పందంగా తిరుగుతున్న ఆ యువకుడిని పట్టుకొని రిమాండ్‌చేశారు. హుజూర్‌నగర్ ఎస్ఐ ముత్తయ్య తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణ పోలీస్‌స్టేషన్‌లో బుధవారం అరెస్టు వివరాలను వెల్లడించారు. ఖమ్మం జిల్లా బొనకల్లు మండలం మోటమర్రి గ్రామానికి చెందిన సుందర్ ప్రమోద్‌కుమార్ అనే యువకుడు అదే గ్రామానికి చెందిన 23 ఏళ్ల యువతిని గత కొన్ని నెలలుగా ప్రేమ పేరుతో వేధిస్తున్నాడు. దీంతో హుజూర్‌నగర్ పట్టణంలోని యువతి మేనమామ ఇంట్లో ఉంటూ ప్రైవేటు ఉద్యోగం చేస్తుంది. సోమవారం (ఈ నెల 10న) మధ్యాహ్నం హుజూర్‌నగర్‌కు మోటార్ సైకిల్‌పై వచ్చిన ప్రమోద్‌కుమార్ యువతితో మాట్లాడాలని రమ్మని ఫోన్‌చేశాడు. దాంతో కొత్తబస్టాండు సమీపంలోని ఎన్జీవోస్ కాలనీ ఎదుట మెయిన్‌రోడ్డుపైకి రాగానే తనను ఎందుకు ప్రేమించడం లేదని ప్రశ్నించాడు.తనవెంట తెచ్చుకున్న పెట్రోలు బాటిల్‌ను తన ఒంటిపై చల్లుకొని ముస్లిం యువతిపై మొత్తం చల్లాడు. దీంతో యువతితో గొడవ పడి అగ్గిపెట్టెను వెలిగించే ప్రయత్నించగా రోడ్డు ఎదుట ఉన్న ఓ దుకాణదారుడు యువకుడిని అడ్డుకొని, యువతిని అక్కడి నుంచి పంపించాడు. దీంతో ఆ యువతి కుటుంబ సభ్యులకు తెలుపగా సోమవారం రాత్రి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కాగా రెండురోజులపాటు ప్రమోద్‌ను పట్టుకునేందుకు ప్రయత్నించగా బుధవారం ఉదయం సమయంలో పట్టణ పరిధిలోని ముక్త్యాల బ్రాంచ్ కెనాల్ సమీపంలో దాడిచేసి ఆకస్మికంగా పట్టుకున్నట్లు ఎస్ఐ ముత్తయ్య తెలిపారు. కాగా ప్రమోద్ నుంచి మోటార్ సైకిల్, పెట్రోల్ బాటిల్, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ప్రేమ పేరుతో యువతిని వేధించిన కేసులో బుధవారం రిమాండ్ చేసినట్లు ఎస్ఐ వెల్లడించారు. సమావేశంలో ఏఎస్ఐలు బాలరాంరెడ్డి, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఆలేరులో వృద్ధురాలి హత్య

● బంగారు పుస్తెల తాడు, నగదు చోరీ



మణెమ్మ(ఫైల్)

ఆలేరు, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): వృద్ధురాలిని హత్య చేసి ఆమె మెడలో ఉన్న బంగారు పుస్తెల తాడు, నగదును అపహరించుకుపోయిన ఘటన బుధవారం యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరులో జరిగింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన రిటైర్డ్ జవాను సతీమణి మణెమ్మ (80) 12వ వార్డులోని తన సొంతింట్లో ఉంటుంది. మధ్యాహ్న సమయంలో ఎవ్వరూ ఇంట్లో లేని సమయంలో టీవీ చూస్తున్న మణెమ్మ మెడలోని బంగారు పుస్తెల తాడు, పరుసులో ఉన్న రూ.5వేల నగదును అపహరించుకుపోయాడు. సాయంత్రం ఇంటికి చేరుకున్న ఆమె కుమారుడు రామారావు తల్లి మృతి చెంది ఉండడాన్ని గమనించి, స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ రజనికర్ ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఇంట్లో సీసీ ఫుటేజీలను ఎస్ఐ పరిశీలించగా సమీప బంధువే ఇంట్లోకి చొరబడి ఈ సంఘటనకు పాల్పడినట్లు తెలుసుకున్నారు.

అతని చేతిలో.. అపురూప చిత్రాలెన్నో



చిత్రాలు గీస్తున్న రుద్ర అక్షయ్ కృష్ణ







అతని చేతిలో అపురూప చిత్రాలు ఎన్నో రూపుదిద్దుకున్నాయి. పాఠశాలలో చదువుతున్న సమయంలోనే అతనికి చిత్రకళపై అమితమైన మక్కువ. అందులో విభిన్నంగా రాణించాలనే తపన అతనిలో ఉండేది. దీంతో అతడు పెన్సిల్‌నే కుంచెగా మలుచుకుని అందమైన చిత్రాలను గీస్తున్నాడు రుద్ర అక్షయ్ కృష్ణ. యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లికి చెందిన రుద్ర పాండురంగ శాస్త్రి, వాసవిల కుమారుడు అక్షయ్‌కృష్ణకి మొదటి నుంచి డ్రాయింగ్ అంటే ఇష్టం. అతని ఆసక్తిని గమనించిన తల్లిదండ్రులు ప్రోత్సహించారు. ఫలితంగా 50కి పైగా చిత్రాలు గీస్తే అందులో అధిక భాగం దేవతా చిత్రాలే ఉండటం విశేషం. కేవలం పెన్సిల్‌తోనే చిత్రాలను గీస్తూ తన ప్రత్యేకతను చాటుకుంటున్నాడు అక్షయ్ కృష్ణ. అతని తండ్రి రుద్ర పాండురంగశాస్త్రి భూదాన్‌పోచంపల్లి మార్కండేశ్వరస్వామి దేవాలయంలో 25 ఏళ్లుగా అర్చకులుగా కొనసాగుతున్నారు. ప్రస్తుతం కాచిగూడ భద్రుక కాలేజీలో డిగ్రీ చదువుతున్నాడు. అక్షయ్‌కృష్ణకు చిన్నప్పటినుంచి చిత్రలేఖనంలో మంచి నేర్పరి. అతడు సహజ సిద్ధంగా తనకు తానుగా ఎవరి సహాయ సహకారాలు అవసరం లేకుండానే చిత్రలేఖనం నేర్చుకున్నారు.

(ఆంధ్రజ్యోతి-భూదాన్‌పోచంపల్లి)

ఎవరైతే మంచిది ?

● ఆశావహులపై గ్రామ వాట్సప్ గ్రూపుల్లో సర్వే ● నగరాల్లో ఉంటూ గ్రామాల్లో అనుచరులకు విందు భోజనాలు

(ఆంధ్రజ్యోతి-మిర్యాలగూడ)

గ్రామాల్లో ఎన్నికల వేడి రాజుకుంటోంది. సర్పంచ్ పదవులకు పోటీచేసే ఆశావాహులు ప్రజల్లోకి వెళ్లేందుకు ప్రయత్నాలు సాగిస్తున్నారు. పంచాయితీ ఎన్నికల నిర్వహణపై ప్రభుత్వం త్వరలోనే నిర్ణయం తీసుకుంటుందనే ప్రచారం ఊపందుకోవడంతో రాజకీయ చర్చలతో గ్రామాల్లో సందడి నెలకొంటోంది. ఎవరివైపు ఊరి ఓటర్లు మొగ్గుచూపుతున్నారో తెలుసుకునేందుకు తమ సన్నిహితుల ద్వారా వాట్సప్ సర్వేలకు తెరలేపుతున్నారు. ఆయా గ్రామాల్లో ఇప్పటికే సర్పంచ్ ఎన్నికల్లో పోటీకై ఆసక్తి చూపుతున్న వారిలో ఎవరైతే మంచిదో టిక్ చేయండని ఆశావహుల పేర్లతో కూడిన జాబితాను గ్రూపుల్లో పోస్ట్ చేస్తున్నారు. ఉన్నత చదువులు చదివి, ఉద్యోగాలు చేస్తున్నవారు సైతం గ్రామాల్లో రాజకీయ ఆధిపత్యం కోసం తహతహలాడుతున్నారు. స్థానికంగా ఉన్న తమ తల్లిదండ్రులు, సమీప బంధువుల్లో ఒకరిని పంచాయతీ బరిలో నిలిపేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. ఓట్లను కూడగట్టే కులసంఘాల నాయకులను ఫోన్ల ద్వారా సంప్రదిస్తున్నారు. తమ కుటుంబం నుంచి అమ్మనో, భార్యనో ఎవరినో ఒకరిని ఎన్నికల్లో పోటీ చేయిస్తా.. మీరు అందరితో మాట్లాడి మనకు అనుకూలంగా ఉండేలా చూడండి. ఖర్చులకు లోటుండదు. ఏం కావాలన్నా నేను సరిచేస్తా. అంటూ స్థానిక నేతలను ప్రసన్నం చేసుకుంటున్నారు. పాత రిజర్వేషన్ల ప్రకారం జరిగితే జనరల్ అయితే తండ్రిని, తమ్ముణ్ని, మహిళా రిజర్వయితే తల్లిని ఎన్నికల్లో పోటీ చేయించేందుకు వేగంగా పావులు కదుపుతున్నారు.



మిర్యాలగూడ మండలం అల్వాలపాడులో వాట్సప్ గ్రూప్ సర్వే నమూనా

భార్యలను బరిలోకి దింపేందుకు ఉద్యోగుల యత్నాలు

ఊరితో అనుబంధం ఉన్న ఉద్యోగుల ప్రజలతో తమకున్న పరిచయాలను ఆసరాగా చేసుకుని తమ భార్యలను బరిలోకి దింపేదుకు ఉద్యోగులు ఉత్సాహం చూపుతున్నారు. ఉద్యోగరిత్యా పట్టణాలకు మకాం మార్చిన వివిధ శాఖల ఉద్యోగులు తమ సతీమణులను సర్పంచ్‌గా ఎన్నికల్లో పోటీ చేయించేందుకు ముందుకు వస్తున్నారు. ఎన్నికల్లో నిలబడితే ఎంత డబ్బు ఖర్చు చేయాల్సి వస్తుంది. ఏ రాజకీయ పార్టీ మద్దతు లభిస్తుందా..? స్వతంత్రంగా నిలబడితే గెలుపోటములు ఎలా ఉంటాయని ఆరా తీస్తున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో ఊర్లోకి వచ్చి సంబంధిత వార్డుల ముఖ్య నాయకులతో సమావేశం జరిపి వెళ్తున్నారు. ఖర్చులు ఇతరత్రా విషయాలు చూసుకునేందుకు మావాడు మీవెంటే ఉంటాడని, బంధువు పేరు సూచించి గెలుపుకోసం కృషిచేయాలని కార్యకర్తలను ప్రోత్సహిస్తున్నారు.

విందు రాజకీయాలు షురూ

గత కొన్నిరోజుల క్రితమే మిర్యాలగూడ పట్టణానికి 10కిలోమీటర్ల దూరంలోని మండలంలో ఓ గ్రామానికి చెందిన ఉద్యోగి తమ అనుయాయులతో కలిసి ఓ దేవస్థానంలో రెండు యాటలు కోసి మందుతో దావత్ ఏర్పాటు చేశాడు. పనిలో పనిగా నియోజకవర్గనేత గెలుపు కోసం మొక్కుబడి చెల్లిస్తున్నట్లు ప్రచారంచేసి ఆ విందుకు సదరు నేతను కూడా ఆహ్వానించారు. విందుకోసం వచ్చిన ప్రజలను నియోజకవర్గనేతకు చూపి సర్పంచ్ పదవికి తన భార్యను పోటీలో దింపనున్నట్లు తన కోరికను బయట పెట్టారని ప్రచారమవుతోంది. పలు గ్రామాల్లో ఇంటిదేవతల పండుగల పేరు చెప్పి విందుకు ఆహ్వానించి గ్రామ ద్వితీయస్థాయి నేతలను మచ్చిక చేసేందుకు యత్నిస్తున్నట్లు తెలుస్తోంది. ఆశావహుల యత్నాలతో పల్లెల్లో క్రమంగా రాజకీయ వేడి రాజుకుంటుంది.

ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించాలి

● దక్షిణమధ్య రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్



రైల్వేస్టేషన్ వద్ద వసతులను పరిశీలిస్తున్న జీఎం అరుణ్‌కుమార్ జైన్

మిర్యాలగూడ, మిర్యాలగూడ అర్బన్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ప్రయాణి కులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు రైల్వే ఉద్యోగులు, సిబ్బంది సమష్టిగా కృషి చేయాలని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ సూచించారు. బీబీనగర్-గుంటూరు రైల్వేమార్గం రెండోలైన్ నిర్మాణ పను లను బుధవారం ఆయన పర్యవేక్షించారు. మార్గమధ్యలో మిర్యాలగూడ రైల్వే స్టేషన్‌లో ఆకస్మిక తనిఖీ చేసి ప్రయాణికుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన వసతులను పరిశీలించారు. స్టేషన్ ఆవరణలోని ప్లాట్‌ఫాం, టికెట్‌బుకింగ్ కౌంటర్, పార్కిల్ వాహనాలను తనిఖీ చేసి ప్రయాణికులకు ఎలాంటి అసౌకర్యం తలెత్తకుండా స్టేషన్ అధికారులు పర్యవేక్షణ చేయాలన్నారు. ప్రయాణికుల్లో అభద్రతా భావాన్ని తొలగించేందుకు తనిఖీలు మరింతగా ముమ్మరం చేయా లని సూచించారు. ఆయన వెంట డివిజనల్ మేనేజర్ రామకృష్ణ, సీనియర్ డీసీఎం ప్రదీప్, డీఓఎం దినేష్‌కుమార్, స్టేషన్ సూపరింటెండెంట్ తారకేశ్వర్, సతీష్ ఉన్నారు.

ప్రత్యామ్నాయ స్థలాలను కేటాయించాలి

చౌటుప్పల్ టౌన్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణంలోని జాతీయ రహదారి సర్వీస్ రోడ్ల నుంచి తొలగించనున్న చిరు వ్యాపారులకు ప్రత్యామ్నాయ స్థలాలను కేటాయించాలని ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోయ రామచందర్, మండల ప్రధాన కార్యదర్శి ఎండీ చాంద్‌పాషా కోరారు. ఈ మేరకు బుధవారం చౌటుప్పల్ ఆర్డీవో శేఖర్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. వ్యాపారుల అడ్డాల తొలగింపుతో సుమారు 300 కుటుంబాలు రోడ్డున పడే అవకాశం ఉందని పేర్కొన్నారు ఈ నెల 26న మహాశివరాత్రి సందర్భంగా పూలు, పండ్ల వ్యాపారాలు పెద్ద ఎత్తున సాగుతాయని, అప్పటి వరకు అడ్డాలను తొలగించకుండ చర్యలు తీసుకోవాలని వారు కోరారు. సమస్యను మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు ప్రయత్నిస్తానని ఆర్డీవో తెలిపారు. వినతి పత్రం అందజేసిన వారిలో సామకూర రాజయ్య, ముత్యాల గణేష్, బోదుల యాదయ్య, ప్రధాన కార్యదర్శి వలిగొండ బిక్షం ఉన్నారు.

మనుషులంతా ఆత్మ స్వరూపులే

● ముగిసిన శరణ్‌దాస్‌జీ శతజయంతి వేడుకలు



ఓంకారాశ్రమంలో పీఠాధిపతులతో ఆశ్రమ నిర్వాహకులు

భువనగిరి టౌన్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మనుషులందరూ ఆత్మ స్వరూపులేనని, మానవులంతా ఒక్కటేనని వివిధ ఆశ్రమాల పీఠాధిపతులు ప్రణవమయి మాత, సంపూర్ణానందగిరిస్వామి శంకరానందగిరిస్వామి, రామకృష్ణానందగిరిస్వామి, నాగప్పస్వామి, మధునూరి వెంకటరామశర్మస్వామి అన్నారు. భువనగిరి ఓంకారాశ్రమంలో మూడు రోజులుగా జరుగుతున్న శరణ్‌దాస్‌జీ మహారాజ్ శతజయంతి వేడుకలు బుధవారం ముగిశాయి. చివరిరోజు జరిగిన వేర్వేరు సమావేశాల్లో వారు మాట్లాడారు. నైతిక విలువలతో జీవనం సాగించాలని, సనాతనధర్మ పరిరక్షణకు అందరూ కట్టుబడి ఉండాలన్నారు. హోమపూజలకు పూర్ణాహుతితో ముగింపు పలికారు. భక్తులందరూ సత్సంగ్ చేసి ధ్యానం చేశారు. మూడు రోజులపాటు జరిగిన వేడుకల్లో రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

భూ నిర్వాసితులకు నష్ట పరిహారం ఇవ్వాలి

● బీజేపీ రాష్ట్ర నాయకుడు గూడూరు నారాయణరెడ్డి



అదనపు కలెక్టర్ వీరారెడ్డికి వినతిపత్రం అందిస్తున్న నారాయణరెడ్డి

భువనగిరి (కలెక్టరేట్), ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): బస్వాపూర్ రిజర్వాయర్ కొరకు తీసుకున్న భూములకు నష్ట పరిహారం అందజేసి పేదలను ఆదుకోవాలని బీజేపీ రాష్ట్ర నాయకులు గూడూరు నారాయణరెడ్డి అన్నారు. భువనగిరి మండలం బీఎన్ తిమ్మాపూర్ భూనిర్వాసితులతో కలిసి ఆయన బుధవారం జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ జీ.వీరారెడ్డికి వినతిపత్రం అందజేసి మాట్లాడారు. పేదల ఇళ్లు శిథిలావస్థకు చేరుకున్నాయని, నష్టపరిహారం మంజూరు అయి మూడు నెలలు కావస్తున్నా ఎందుకు అందజేయడం లేదని ప్రశ్నించారు. కాలయాపనతో భూనిర్వాసితులు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. పరిస్థితి అర్థం చేసుకొని వెంటనే నష్ట పిహారం అందజేయాలని కోరారు. స్పందించిన అదనపు కలెక్టర్ భూనిర్వాసితుల డబ్బులను గ్రామంలో త్వరలో గ్రామసభ పెట్టి వారి ఖాతాలలో జమ చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలియజేశారు. కార్యక్రమంలో వల్దాస్ రాజ్ కాలభైరవ, వల్లందాసు గండయ్య, పిన్నం గణేష్, హరినాథ్, సుదర్శన్ గ్రామస్థులు ఉన్నారు.

యాదాద్రి మేడారంలో భక్తుల మినీ జాతర



అమ్మవారికి ఒడి బియ్యం సమర్పిస్తున్న మహిళలు

రాజాపేట, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా రాజాపేట మండలం చల్లూరులోని యాదాద్రి మేడారం సమక్క, సారలమ్మ మినీ జాతరను బుధవారం గ్రామస్థులు నిర్వహించారు. ముందుగా గ్రామంలోని గ్రామదేవతలకు పూజలు నిర్వహించారు. స్థానిక శివాలయంలో పూజలు నిర్వహించి డప్పు చప్పుళ్లతో జల కడవలతో భక్తులు ఊరేగింపుగా సమక్క, సారలమ్మల గద్దెల వద్దకు తరలివెళ్లారు. గద్దెల వద్ద పూజలు నిర్వహించి అమ్మవార్లకు ఒడిబియ్యాన్ని సమర్పించి మొక్కులను చెల్లించుకున్నారు. చల్లంగా చూడు తల్లి అంటూ వేడుకున్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వంచ వీరారెడ్డి, నాయకులు బింగి కరుణాకర్, భీమగాని బాల్‌నర్సు, శ్రీకాంత్, మాటూరి శ్రీనివాస్, రమేష్, గోవర్ధన్‌రెడ్డి, పూజార్లు ఉపేందర్, భూపాల్ తదితరులు పాల్గొన్నారు.

కందులు కొనేవారేరీ?

● కొనుగోలు కేంద్రం తెరిచి 17 రోజులు
● బ్యానర్ తొలగించి రైతుల నిరసన
● మోత్కూరు నుంచి కందులను తిరుమలగిరి మార్కెట్‌కు తరలిస్తున్న రైతులు



మోత్కూరు కొనుగోలు కేంద్రంలో పోసిన కందులను తిరుమలగిరి మార్కెట్‌కు తరలించడానికి బస్తాల్లో నింపుతున్న రైతులు

మోత్కూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ఆరుగాలం కష్టపడి పండించిన కంది పంటను రైతులు అమ్ముకోవడానికి నానా అగచాట్లు పడుతున్నారు. కందులకు ప్రభుత్వ మద్దతు ధర క్వింటాలు రూ.7,550 ఉండగా, ప్రైవేటు వ్యాపారులు రూ.6500 నుంచి రూ.7,100 వరకు కొంటున్నారు. కంది చేలు కోసి సుమారు రెండు మాసాలు అవుతుంది. పంట కోత సమయంలో ప్రభుత్వం కందుల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో మోత్కూరు, ఆత్మకూరు(ఎం), గుండాల, అడ్డగూడూరు మండలాల కంది రైతులు కొందరు తిరుమలగిరి మార్కెట్‌కు తీసుకెళ్లి ప్రైవేటు వ్యాపారులకు తక్కువ ధరకు విక్రయిస్తున్నారు. మరికొందరు రైతులు ప్రభుత్వం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేశాక మద్దతు ధరకు అమ్ముకుంటే ఇంతో, అంతో కలిసొస్తుందని దాచిపెట్టారు.

యాదాద్రిభువనగిరి జిల్లాలో తెరిచింది ఒక్క కేంద్రమే

యాదాద్రి భువనగిరి జిల్లాలో ప్రభుత్వ మద్దతు ధరకు కందులు కొనడానికి మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో మోత్కూరు మార్కెట్ యార్డులో రైతు సేవా సహకార సంఘం ఏర్పాటు చేసిన కందుల కొనుగోలు కేంద్రాన్ని గత నెల 26న ప్రారంభించారు. కొనుగోలు కేంద్రం ప్రారంభించినప్పుడే ఎమ్మెల్యే మందుల సామేలు ఈ సారి కంది పంట తక్కువగా ఉందని, ఇప్పటికే కొందరు రైతులు విక్రయించినందున మిగిలిన రైతులవైనా ఇబ్బంది పెట్టకుండా కొనుగోలు చేయాలని అధికారులకు సూచించారు. జిల్లాలో తెరిచిన కందుల కొనుగోలు కేంద్రం ఇదొక్కటే. కందుల నాణ్యత పరిశీలకుడిగా మోత్కూరు ఏఈవో గోపీనాథ్‌ను నియమించారు. కొనుగోలు కేంద్రం ప్రారంభించి 17రోజులైనా నేటికీ ఒక్క బస్తా కూడా కొనలేదు. దీంతో కందులు కొననప్పుడు కొనుగోలు కేంద్రం బ్యానర్ ఎందుకంటూ రైతులు మంగళవారం బ్యానర్ తొలగించి నిరసన వ్యక్తం చేశారు.

కందులను తిరుమలగిరికి తరలించిన రైతులు

విత్తు ముందా, చెట్టు ముందా అన్న సామెతలా రైతులు వంద క్వింటాళ్ల పైన కందులు తెచ్చి రాశులు పోస్తేనే కొంటామని కేంద్రం నిర్వాహకులు, వారు కొంటుంటే మేము తెచ్చి రాశులు పోస్తామని రైతులు అంటూ వారం పది రోజులు నిర్వాహకులు కందులు కొనలేదు. రైతులు రోజు వచ్చి కందులు కొంటారా అని అడిగిపోవడమే తప్ప కేంద్రానికి కందులు తీసుకురాలేదు. చివరకు గుండాల, ఆత్మకూరు, మోత్కూరు రైతులు ఐదారు రోజుల క్రితం సుమారు వంద క్వింటాళ్ల కందులు తెచ్చి మోత్కూరు కందుల కొనుగోలు కేంద్రంలో రాశులు పోశారు. కందులు తూర్పార బట్టి, ఆరబెట్టారు. ఐనా కొనడం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. తేమ శాతం 12 కన్నా ఎక్కువ ఉన్నందున కొనడం లేదని నాణ్యత పరిశీలకుడు, కొనుగోలు కేంద్రం నిర్వాహకులు చెబుతుండగా మూడు నాలుగు రోజులు ఎండబోసినా ఉదయం తేమ శాతం 13 చూపిస్తోందని, సాయంత్రం 15 చూపిస్తోందని అదేమి మాయిశ్చర్ యంత్రమని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నాలుగైదు రోజుల కన్నా ఎక్కువ రోజులు ఎండ బెట్టినట్టయితే కందులు నల్లబడి ప్రైవేటు వ్యాపారులు కూడా కొనకుండా అవుతాయని కంది రైతులు పట్వారి వీరసోమయ్య(పారుపల్లి), మంటిపల్లి యమున(నర్సాపురం), కాటం రాములు(రాఘవాపురం), దయ్యాల శ్రీహరి(పారుపల్లి) అన్నారు. కోతులు, పందుల బాధ భరించలేక పోతున్నామని, ఎన్ని రోజులు ఉన్నా ఏదో సాకు చెప్పడం తప్ప ఇక్కడ కొనేలా లేరని ఈ నెల 11న, 12న పలువురు రైతులు రాశులు పోసిన కందులను తిరిగి బస్తాల్లో నింపుకుని ట్రాక్టర్లలో తిరుమలగిరి తీసుకెళ్లారు. తాము ఇంటి నుంచి నేరుగా తిరుమలగిరి తీసుకెళ్లకుండా ఇక్కడకు తేవడం వల్ల తమపై ట్రాక్టర్ రవాణా చార్జీలు, రాశులు పోయడం, ఆరబెట్టడం, తూర్పార బట్టడం, బస్తాల్లో నింపడం తదితర పనులకు కూలీల ఖర్చు అదనంగా మీదపడిందన్నారు.

కోతులు, పందులు, దోమల బెడద

మోత్కూరు మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన కందుల కొనుగోలు కేంద్రంలో కందులు తెచ్చి రాశులు పోస్తే రక్షణ లేదని రైతులు పేర్కొంటున్నారు. కోతులు, పందులు వచ్చి ఆగమాగం చేస్తున్నాయని రైతులు ఆవేదన చెందుతున్నారు. రాత్రి మార్కెట్లో లైట్లు కూడా వెలుగవని, రాశుల వద్ద కాపలాగా పడుకుంటే దోమల బెడద, చీకట్లో పురుగుబూసి వస్తుందన్న భయంతో జాగారాలు చేస్తున్నామన్నారు. ప్రభుత్వం కొనలేనప్పుడు కేంద్రాలు ఏర్పాటు చేయడమెందుకని వారు ప్రశ్నించారు. ఇప్పటికైనా కందులు వెంటనే కొనాలని లేని పక్షంలో కేంద్రాన్ని మూసి వేయాలని అక్కడ రాశులు పోసిన రైతులు అంటున్నారు.

మూడు రోజులు ఆరబెట్టా..



నేను మోత్కూరు కందుల కొనుగోలు కేంద్రానికి 15 క్వింటాళ్ల కందులు తీసుకొచ్చా. మూడు రోజులు ఆరబెట్టాను. తూర్పార బట్టి శుభ్రం చేశా. మూడు రోజులు ఆరబెట్టాక ఉదయం తేమ శాతం పరిశీలిస్తే 13 శాతం ఉన్న కందులు సాయంత్రం వరకు ఆరబెట్టాక చూస్తే మళ్లీ చూస్తే 15 శాతం చూపించింది. ఇదేమిటని అడిగితే అధికారులు ఏదేదో చెబుతున్నారు. ఇక లాభం లేదని ఈ రోజు తిరిగి తిరుమలగిరికి తీసుకు వెళ్తున్నా.

-పట్వారి వీరసోమయ్య, కంది రైతు, పారుపల్లి

తేమ శాతం 12కు మించి ఉండటంతో కొనడం లేదు

మార్క్‌ఫెడ్ నిబంధనల ప్రకారం కందులు 12 తేమ శాతం ఉంటేనే కొనాలి. రైతులు కేంద్రానికి తెచ్చిన కందులు పరిశీలిస్తే తేమ శాతం 15, 16 ఉంటోంది. డీఎం జ్యోతికి ఫోన్ చేసి రైతులతోనూ మాట్లాడించాను. తేమ శాతం ఎక్కువ ఉండి తీసుకుని పంపితే కందులు వాపసు పంపుతామని, లారీ రవాణా చార్జీ సంఘం భరించాలని సూచిస్తున్నారు. తేమ శాతం 12 లేనందునే కొనడం లేదు.

- కె.వరలక్ష్మి, సంఘం సీఈవో, మోత్కూరు

పూర్వగిరీశుడికి శ్రీపుష్పయాగం

● సంప్రదాయరీతిలో చక్రతీర్థస్నానం.. పూర్ణాహుతి
● కొనసాగుతున్న పాతగుట్ట లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు

భువనగిరి అర్బన్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట దేవస్థాన అనుబంధ ఆలయం పాతగుట్ట లక్ష్మీనరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. వేడుకల్లో భాగంగా బుధవారం రాత్రి దేవతోద్వాసన, పుష్పయాగం, డోలారోహణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ మండపంలో ఉత్సవ మూర్తులను దివ్యమనోహరంగా అలంకరించి సహస్రనామ పఠనాలు, వివిధ రకాల పుష్పాలతో అర్చించారు. మహోత్సవాల్లో విశేష సేవలు అందుకున్న స్వామివారిని రాగ, తాళలతో అర్చించడం ఆలయ సంప్రదాయమని, స్వామిఅమ్మవార్లను ఏకాంత సేవలో నిర్వహించే వేడుకే డోలారోహణమని దేవస్థాన ప్రధానార్చకుడు నల్లన్‌థిఘళ్ లక్ష్మీనరసింహాచార్యులు వివరించారు. మధ్యాహ్నం వేళ స్వామి వారిని పుష్కరిణికి తీసుకువెళ్లి చక్రతీర్థస్నానం నిర్వహించారు. పట్టువస్త్రాలు, బంగారు, ముత్యాల ఆభరణాలు, వజ్రవైఢూర్యాలు, వివిధ రకాల పుష్పాలతో స్వామివారికి విశేష అలంకారం చేసి పురవీధి సేవ నిర్వహించారు. పూజా కైంకర్యాలను ప్రధానార్చకులు నల్లన్‌థిఘళ్ లక్ష్మీనరసింహాచార్యులు, కాండూరి వెంకటాచార్యులు, ఉపప్రధానార్చకులు భట్టర్ సురేంద్రాచార్యులు, కొడకండ్ల మాధవాచార్యులు, వేదపండితులు, అర్చక బృందం నిర్వహించారు. నేడు ఆలయంలో నిర్వహించే అష్టోత్తర శత ఘటాభిషేకం, మహదాశీర్వచనం, పండిత సన్మానంతో ఉత్సవాలు పరిసమాప్తం కానున్నాయి. కార్యక్రమంలో దేవస్థాన అనువంశిక ధర్మకర్త బి.నర్సింహమూర్తి, ఈవో ఏ.భాస్కర్‌రావు, డీఈవో దోర్బల భాస్కర్‌శర్మ, ఏఈవో దూశెట్టి కృష్ణ, పర్యవేక్షకుడు శంకర్‌నాయక్ పాల్గొన్నారు.



స్వామివారి చక్రతీర్థస్నానంలో పాల్గొన్న ఈవో భాస్కర్‌రావు, అర్చకులు, అధికారులు



ఆలయంలో పూర్ణాహుతి నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరీశుడికి శాస్త్రోక్తంగా నిత్యపూజలు

యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామి దివ్యక్షేత్రంలో బుధవారం నిత్య పూజలు వైభవంగా నిర్వహించారు. సుప్రభాతంతో స్వామిఅమ్మవార్లను మేల్కొలిపిన అర్చకులు గర్భగుడిలో కొలువుదీరిన స్వయంభువులను, సువర్ణ ప్రతిష్ఠామూర్తులను అభిషేకరించి తులసీదళాలతో సహస్రనామార్చనలు జరిపారు. ప్రధానాలయం అష్టభుజి ప్రాకార మండపంలో స్వామిఅమ్మవార్లను అలంకరించి ప్రత్యేక వేదికపై తీర్చిదిద్ది సుదర్శన శతక పఠనాలతో హవనం నిర్వహించారు. అనంతరం గజవాహన సేవలో ఊరేగించి విష్వక్సేనుడి తొలిపూజలతో నిత్య తిరుకల్యాణోత్సవ పర్వాలు ఆగమశాస్త్రరీతిలో నిర్వహించారు. సాయంత్రం ముఖమండపంలో దర్బారు సేవోత్సవం చేపట్టిన ఆచార్యులు అంకార వెండిజోడు సేవలు, సహస్రనామార్చనలు జరిపారు. పాతగుట్ట ఆలయంలో వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ నిత్య పూజలు కొనసాగాయి. కొండపైన శివాలయంలో శ్రీపర్వతవర్ధిని రామలింగేశ్వరస్వామికి రుద్రహవనం శైవాగమ పద్ధతిలో నిర్వహించారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ. 18,39,824 ఆదాయం సమకూరినట్లు ఈవో ఏ. భాస్కర్‌రావు తెలిపారు.

కృష్ణయ్యకు డాక్టరేట్



కనగల్, ఫిబ్రవరి 12: (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా కనగల్ మండలంలోని కురంపల్లి గ్రామానికి చెందిన సోమ కృష్ణయ్యకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. క్రిష్ణయ్య హైదరాబాద్ రాష్ట్రంలో కరువులు (1858-1948) అనే అంశంపై సీనియర్ ప్రొఫెసర్ సుధారాణి పర్యవేక్షణలో చేసిన పరిశోధనకు ఈ అవార్డు దక్కింది.

రాంనర్సింహగౌడ్‌కు..



నార్కట్‌పల్లి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలం గోపలాయపల్లి గ్రామానికి చెందిన వీరమళ్ల రాంనర్సింహగౌడ్‌కు ఉస్మానియా యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్‌ను ప్రకటించింది. ఓయూ న్యాయ కళాశాల ప్రొఫెసర్ ప్రతాప్‌రెడ్డి పర్యవేక్షణలో న్యాయ శాస్త్ర విభాగంలో భారతదేశంలోని చిన్నపిల్లలపై నేరాలు-నివారణ అనే అంశంపై పరిశోధన చేసినందుకు డాక్టరేట్ ప్రకటించింది.

ఎల్లమ్మ తల్లికి ప్రత్యేక పూజలు

కనగల్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మాఘమాసం పౌర్ణమి పురస్కరించుకుని మండలంలోని దర్వేశిపురం రేణుకా ఎల్లమ్మ ఆలయంలో అర్చకులు బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి ప్రాంత:కాల నిజ అభిషేకాలు, విశేష అలంకరణలు, కుంకుమ పూజలను నిర్వహించారు.

ఉపాధ్యాయురాలి కుటుంబానికి న్యాయం చేయాలి



జాతీయ రహదారిపై రాస్తారోకో చేస్తున్న విద్యార్థులు, గ్రామ పెద్దలు

మోత్కూరు, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): అడ్డ గూడూరు మండలం చౌళ్లరామారం సమీపాన ఈ నెల 11న జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఉపాధ్యాయురాలు జబీన కుటుంబానికి న్యాయం చేయాలని మో త్కూరు మండలం పాలడుగు, మోత్కూరుల్లో విద్యార్థులు బుధవారం రాస్తారోకో నిర్వహించారు. ఉపాధ్యాయురాలు జబీన పాలడుగు ప్రాథమికోన్నత పాఠశాలలో పని చేసినప్పుడు విద్యార్థులకు ఉత్తమ విద్యనందించడంతో పాటు పలు సేవా కార్యక్రమాల్లో పాల్గొనే వారని గ్రామ పెద్దలు పేర్కొన్నారు. బుధవారం ఉదయం పాఠశాలలో ప్రార్థన సమయంలో ఆమె మృతి పట్ల విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు రెండు నిముషాలు మౌనం పాటించి సంతాపం తెలిపారు. అనంతరం జాతీయ రహదారిపై ఆమె చిత్రపటం వద్ద నివాళులర్పించి, రోడ్డు ప్రమాదానికి కారకులైన వాహనాన్ని, డ్రైవర్‌ను గుర్తించి అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని, జబీన కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ రాస్తారోకో నిర్వహించారు. మోత్కూరులోనూ విద్యార్థి రాజకీయ పార్టీ నాయకులు విద్యార్థులతో కలిసి మోత్కూరులో రాస్తారోకో నిర్వహించారు. రోడ్డు కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతోనే ఈ ప్రమాదం జరిగిందని, జబీన కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఆయా కార్యక్రమాల్లో పాలడుగు మాజీ సర్పంచ్ మర్రిపల్లి యాదయ్య, విశ్రాంత ఎంఈవో బద్దం యాదిరెడ్డి, పలువురు గ్రామ పెద్దలు, ఎడ్ల నరేష్, ఎల్లెబోయిన మహేష్, వినయ్ కుమార్, నవీన్ పాల్గొన్నారు.

టీచర్‌ను ఢీకొట్టిన వాహనం గుర్తింపు

అడ్డగూడూరు, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా అడ్డగూడూరు మండలంలోని చౌళ్లరామారం గ్రామ శివారులో ఈ నెల 11న ప్రభుత్వ టీచర్ స్కూటీపై వెళ్తుండగా ఢీకొట్టిన వాహనాన్ని పోలీసులు గుర్తించారు. ఎస్‌ఐ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని మంగమ్మగూడెం గ్రామానికి చెందిన మచ్చస్‌రెడ్డికి చెందిన కంకర లోడు టిప్పర్ ఢీ కొట్టినట్లు సీసీ కెమెరా ఫుటేజీ ఆధారంగా గుర్తించామన్నారు. టిప్పర్‌ను స్వాధీనం చేసుకునిపోలీస్ స్టేషన్‌కు తరలించి, మచ్చస్‌రెడ్డిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

జాతీయ స్థాయి హాకీ పోటీలకు సునీల్‌కుమార్



గుర్రంపోడు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : ఆల్ ఇండియా సివిల్ సర్వీస్ హాకీ టోర్నమెంట్ తెలంగాణ రాష్ట్రజట్టుకు గుర్రంపోడు మండలం పిట్టలగూడెం గ్రామ జడ్పీ ఉన్నత పాఠశాల గణిత స్కూల్ అసిస్టెంట్ అద్దంకి సునీల్‌కుమార్ ఎంపికయ్యారు. ఈ నెల 13 నుంచి వచ్చే నెల 1వ తేదీ వరకు ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడలో జరిగే దేశంలోని అన్ని రాష్ట్రాల ఉద్యోగుల హాకీ జట్లు పాల్గొనే జాతీయ స్థాయి హాకీ పోటీల్లో అద్దంకి సునీల్‌కుమార్ తెలంగాణ రాష్ట్ర జట్టులో పాల్గొననున్నారు. గత నెలలో హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి హాకీ టోర్నమెంట్ ఎంపిక పోటీల్లో ప్రతిభ ఆధారంగా సునీల్‌కుమార్‌ను ఎంపిక చేశారు. ప్రభుత్వం రాష్ట్రం నుంచి ఎంపిక చేసిన 18 మంది ఉద్యోగుల్లో సునీల్‌కుమార్ ఒకరు. అద్దంకి సునీల్ కుమార్ ఎంపిక పట్ల పాఠశాల హెచ్‌ఎం నకిరేకంటి యాదయ్య, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

హరితహారం చెట్ల కూల్చివేత



కూల్చివేసిన చెట్లు

మునుగోడు రూరల్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం రాష్ట్రాన్ని హరితవనంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికగా హరితహారం కార్యక్రమాన్ని చేపట్టింది. ఈ హరితహారం కార్యక్రమంలో రోడ్డుకు ఇరువైపులా పచ్చదనాన్ని పెంపొందించేందుకు చెట్లను నాటింది. అలాంటి చెట్లను ఎలాంటి అనుమతి లేకుండానే హరితహారం చెట్లను నరికి వేశారు. గుర్తుతెలియని వ్యక్తులు చెట్లను కూల్చివేసి సొమ్ము చేసుకుంటున్నారు. నల్లగొండ జిల్లా మునుగోడు మండలంలోని చల్మెడ గ్రామంలో బుధవారం రోడ్డుకు ఇరువైపులా హరితహారం నాటిన మొక్కలను ఎలాంటి అనుమతి లేకుండానే కొందరు వ్యక్తులు అక్రమంగా నరికివేశారు. ఈ విషయాన్ని గ్రామపంచాయతీ కార్యదర్శికి తెలియడంతో హుటాహుటిన సిబ్బందిని అక్కడికి పంపడంతో సిబ్బందిని చూసిన సదరు వ్యక్తులు పరారయ్యారు. చెట్లను రక్షించాల్సింది పోయి అక్రమంగా నరికి సొమ్ము చేసుకోవడం తగదని, చెట్ల నరికివేసిన వ్యక్తులను గుర్తించి వెంటనే చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు.

'రంగరాజన్‌పై దాడి హేయం'

శాలిగౌరారం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): చిలుకూరు బాలాజీ ఆలయ ప్రధాన అర్చకుడు రంగరాజన్‌పై దాడి హేయమని బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యుడు జమ్ము రమేష్, పార్టీ మండల అధ్యక్షుడు తోట వినోద్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడారు. బ్రాహ్మణులు ఎంతో నియమనిష్ఠలు కలిగిన వారని, అలాంటి పవిత్ర వృత్తి నిర్వహించే బ్రాహ్మణులపై దాడులు చేయడం దుర్మార్గమైన చర్య అన్నారు. దాడి చేసిన వారిపై కఠినచర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

'ఆర్యవైశ్య కార్పొరేషన్‌కు రూ. వెయ్యి కోట్ల నిధులు కేటాయించాలి'

మర్రిగూడ, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): ఆర్యవైశ్యులకు కార్పొరేషన్ ఏర్పాటు చేసి రూ. వెయ్యి కోట్లు నిధులను విడుదల చేయాలని ఆర్యవైశ్య చైతన్య పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు బూరుగు నాగరాజు డిమాండ్ చేశారు. మర్రిగూడలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ఆర్యవైశ్యులకు కార్పొరేషన్ ప్రకటించినా నిధులు మంజూరు చేయకపోవడంతో నిరుపేదలైన ఆర్యవైశ్యులు నిరుత్సాహంతో ఉన్నారని పేర్కొన్నారు. వారి ఉపాధి కోసం నిధులు మంజూరుచేయాలని కోరారు.

దూరవిద్య నోటిఫికేషన్ విడుదల

నల్లగొండ, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): ఉస్మానియా విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ జి.రాంరెడ్డి సెంటర్ దూరవిద్యలో వివిధ కోర్సుల్లో ప్రవేశాలకు బుధవారం నోటిఫికేషన్ విడుదల చేసినట్లు ఎన్జీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సముద్రాల ఉపేందర్, కోఆర్డినేటర్ డాక్టర్ వెల్దండి శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. యూజీసీ నిబంధనల మేరకు వివిధ కోర్సుల్లో ప్రతి ఏటా రెండు దఫాలుగా ప్రవేశాలు ఉంటాయని, అందులో భాగంగానే రెండో దఫా మార్చి 31వ తేదీ వరకు అర్హులైన అభ్యర్థులు ప్రవేశాలు పొందవచ్చని పేర్కొన్నారు. రిజిస్ట్రేషన్, కోర్సు, పరీక్ష ఫీజులు ఆన్‌లైన్ విధానంలోనే చెల్లించాలని, ఇతర వివరాలకు 9866977741 నెంబర్‌ను సంప్రందించాలని ఆయన కోరారు.

కాంగ్రెస్‌తోనే సామాజిక న్యాయం

చిట్యాల, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం సామాజిక న్యాయం కోసం కృషి చేస్తుందని మునిసిపల్ మాజీ చైర్మన్ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. ఎస్సీ వర్గీకరణకు మద్దతు తెలిపినందుకు బేడ బుడిగ జంగాల సంఘం ఆధ్వర్యంలో బుధవారం చిట్యాలలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యే వీరేశం చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఎస్సీ వర్గీకరణకు కాంగ్రెస్ మద్దతిస్తుందని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పోకల దేవదాస్, కోనేటి కృష్ణ, ఏర్పుల పరమేశం, ఎద్దులపురి కృష్ణ, అశోక్, ఇబ్రహీం, నర్సింహ, రాజు పాల్గొన్నారు.

పట్టణ ప్రకృతి వనాల జాడేదీ?



- నీళ్లు, నిర్వహణ లేక ఎండిపోతున్న మొక్కలు
- అధికారుల నిర్లక్ష్యంతో రూ.లక్షలు వృథా
- వేసవిలో ప్రజలకు ఆహ్లాదం అందని ద్రాక్షే

ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వ హయాంలో పట్టణాల్లో ప్రకృతివనాలు ఏర్పాటు చేశారు. కానీ ఎవరూ పట్టించుకోకపోవడంతో వీటి పరిస్థితి అధ్వానంగా మారింది. సరైన నిర్వహణ, అధికారుల పర్యవేక్షణ లేక మొక్కలు ఎండిపోతున్నాయి. పచ్చదనమేమో గానీ ప్రకృతి వనాలు ఉన్న ప్రాంతాలు పిచ్చిమొక్కలతో పాటు బీడు భూములను తలపిస్తున్నాయి. మొక్కలు దెబ్బతినకుండా కంచెలు, బోర్డులు ఏర్పాటు చేశారే తప్ప ఆ మొక్కల నిర్వహణకు నీళ్లు మాత్రం పోయడం లేదు. కనీసం ఎండిపోయిన వాటి స్థానాల్లో వేరే మొక్కలు నాటకపోవడంతో ప్రకృతి వనాలు కనుమరుగవుతున్నాయి. వేసవి మొదలవడంతో చాలా మంది సాయంత్రం సమయంలో ఆహ్లాదం కోసం ఊరి బయట ఉండే ప్రకృతి వనానికి వెళ్తే అక్కడ మొక్కలే కనిపించడం లేదు. సరిగ్గా నిర్వహించలేనప్పుడు ఎందుకు ఏర్పాటు చేశారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

\- (ఆంధ్రజ్యోతి,నల్లగొండటౌన్)

కోట్లు పెట్టారు... నిర్వహణ మరిచారు....

నల్లగొండ పట్టణంలోని 48 వార్డుల పరిధిలో 34 పట్టణ ప్రకృతివనాలను సుమారు రూ. 2.84 కోట్లు వెచ్చించారు. చాలా చోట్ల స్థలం లేకపోవడంతో జనావాసాలకు దూరంగా ఎవ్వరికీ ఉపయోగపడని ప్రాంతంలో ఏర్పాటు చేశారు. లక్షలు పెట్టి ఏర్పాటు చేసినప్పటికీ నిర్వహణ గాలికి వదిలేయడంతో నిధులు వృథా అవుతున్నాయి. కొన్నిచోట్ల ప్రకృతివనాల చుట్టూ కంచె ఏర్పాటు చేయకపోవడంతో పశువులు సంచరించి నాటిన మొక్కలను తినేశాయి. వనాల నిర్వహణకు ప్రత్యేక నిధులు కూడా విడుదల చేయలేదు. ప్రస్తుతం సగం వనాల్లో 80 శాతం పైగా మొక్కలు ఎండిపోయాయి.

అయితే కొంత కాలంగా ఈ ప్రకృతి వనాలపై మునిసిపల్ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రజలకు ఉపయోగపడకుండా పోతున్నాయి. చాలా చోట్ల పిచ్చిమొక్కలతో పాటు నాడు పాతిన మొక్కలకు ఊతంగా ఏర్పాటు చేసిన కర్రలు మాత్రమే దర్శనమిస్తున్నాయి. ముఖ్యంగా పట్టణంలోని 43వ వార్డు పరిధిలో రైల్వేస్టేషన్‌కు వెళ్లే మార్గంలో ఏర్పాటు చేసిన ప్రకృతివనం పూర్తిగా నిరుపయోగంగా మారింది. అది కాస్త కేవలం బోర్డుకే పరిమితమైంది. లక్షలు వెచ్చించి ఫెన్సింగ్ ఏర్పాటు చేసి మొక్కలు నాటినా నిర్వహణ లోపం కారణంగా నిరుపయోగంగా మారడమే కాకుండా పిచ్చిమొక్కలు పెరగడంతో గేటుకు తాళాలను వేశారు.

ప్రకృతి వనాల నిర్వహణ చేపట్టాలి



పట్టణాల్లో పచ్చదనాన్ని పెంచే లక్ష్యంగా ఏర్పాటు చేసిన పట్టణ ప్రకృతి వనాల నిర్వహణ అధ్వానంగా తయారైంది. మొక్కలు చెట్లు పెరగాల్సిన చోట పిచ్చిమొక్కలు, గడ్డి పెరిగి నిరుపయోగంగా మారాయి. మునిసిపల్ అధికారులు ఇప్పటికైనా మేల్కొని పట్టణ ప్రకృతివనాల నిర్వహణ చేట్టాలి. తద్వారా పట్టణ ప్రజలందరికీ వేసవిలో ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించాలి.

\- బొల్లం మధు, నల్లగొండ

ప్రకృతి వనాలు మానిటరింగ్ చేస్తున్నాం

పట్టణ ప్రకృతి వనాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాం.ఎక్కడ కూడా మొక్కలు చనిపోలేదు. ఇప్పటి వరకు ఎండ తీవ్రత లేనందున నేటి సరఫరా చేయలేదు. అవసరమైతే వేసవిలో ట్యాంకర్లను ఏర్పాటు చేసి మొక్కలను సంరక్షిస్తాం.మొక్కల సంరక్షణ కోసం ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నాం. ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా పట్టణ ప్రకృతి వనాలను విస్తరింప జేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

\- సయ్యద్ ముసాబ్ అహ్మద్, మునిసిపల్ కమిషనర్

ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

నల్లగొండ, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): ఉద్యోగులు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని భారత ఆహార సంస్థ డివిజనల్ మేనేజర్ సునీల్ కుమార్ అన్నారు. ఎఫ్‌సీఐ జిల్లా కార్యాలయలో బుధవారం హైదరాబాద్ యశోద ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత కార్డియాలజీ మెడికల్ క్యాంపును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు నిత్యం పని ఒత్తిడికి గురవుతుంటారని, ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకుంటే విధి నిర్వహణ సులువుగా సాగుతుందన్నారు. కార్యక్రమంలో వైద్యులు గురురాజు ప్రమోద్, ఆస్పత్రి మేనేజర్ వినయ్, ఎఫ్‌సీఐ ఉద్యోగులు కెఎన్‌కే ప్రసాద్, కేకేషా, జిల్లా శ్రీనివాసరావు, నిర్వాహకులు సతీష్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

కేతేపల్లిలో కంటి వైద్యశిబిరం

నాంపల్లి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని కేతేపల్లి గ్రామంలో స్వేరో విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో బుధవారం కంటి వైద్య శిబిరం నిర్వహించారు. లేజర్ ఆప్టికల్స్ దేవరకొండ వారి ఆధ్వర్యంలో శిబిరంలో గ్రామస్తులకు కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. కంటి చూపు సమస్య ఉన్న ప్రతి ఒక్కరికి కంటి పరీక్షలు నిర్వహించి, కంటి అద్దాలతో పాటు మందులు అందజేశారు. వైద్య శిబిరం ఏర్పాటు చేసిన స్వేరో విద్యార్థి సంఘం నల్లగొండ జిల్లా అధ్యక్షుడు ఆకులపల్లి సురేష్‌ను గ్రామస్థులు అభినందించారు. కార్యక్రమంలో డాక్టర్ చారి, సురేష్, నవీన్, ఉపాధ్యాయులు సైదులు, గాదెపాక వేలాద్రి, జంగయ్య, అధిక సంఖ్యలో గ్రామస్థులు పాల్గొన్నారు.

కార్మికుల శ్రేయస్సు కోసం యూనియన్ కృషి


జెండా ఆవిష్కరిస్తున్న వెంకటయ్య

నల్లగొండటౌన్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): కార్మిక శ్రేయస్సు కోసం 1104 యూనియన్ కృషి చేస్తుందని యూనియన్ జిల్లా కార్యదర్శి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్.వెంకటయ్య అన్నారు. తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ 1104 యూనియన్ ఏర్పడి 75 సంవత్సరాలైన సందర్భంగా రాష్ట్ర నాయకత్వ ఆదేశాల మేరకు బుధవారం గొల్లగూడలోని విద్యుత్ కార్మిక సంక్షేమ (యూనియన్ ఆఫీస్)లో ఘనంగా వజ్రోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన జెండా ఆవిష్కరించి, కేక్ కట్ చేశారు. అనంతరం వెంకటయ్య మాట్లాడుతూ 1950 ఫిబ్రవరి 12న 1104 యూనియన్ వీటీపీఎస్‌లో అంకురార్పణ జరిగి నేటికీ 75 వసంతాలు పూర్తి చేసుకుందని అన్నారు. విద్యుత్ ఉద్యోగులకు శుభాకాంక్షలు తెలిపారు. నిత్యం పోరాటాలు చేస్తూ, ఏ పార్టీకి అనుబంధం లేకుండా, రాష్ట్రంలో విద్యుత్‌శాఖలో మెజార్టీ సంఘంగా కొనసాగుతున్నందుకు చాలా సంతోషంగా ఉందన్నారు. రాబోయే కాలంలో విద్యుత్ వినియోగదారులకు మంచి సేవలందించి విద్యుత్ శాఖకు, ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు టి.శ్రీనివాస్‌గౌడ్, నల్లగొండ డివిజన్ అధ్యక్షుడు పి.రాంబాబు, సర్కిల్ యూనిట్ అధ్యక్షుడు డి.కోటి, కార్యదర్శి కత్తుల సీనయ్య, పీవీనాయక్, పర్వేజ్, భీమార్జున్‌రెడ్డి, జిల్లా కోశాధికారి శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

భూభారతితో భూ సమస్యల పరిష్కారం


సమావేశంలో మాట్లాడుతున్న భూమి చట్టాల నిపుణుడు సునీల్

గట్టుప్పల్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూభారతితో భూ సమస్యలు పరిష్కారమవుతాయని భూభారతి రూపశిల్పి, వ్యవసాయ భూమి చట్టాల నిపుణుడు భూమి సునీల్ అన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న భూభారతి చట్టం, విత్తన చట్టాలు, వ్యవసాయ చట్టాలపై మండలంలోని నామాపురం గ్రామంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. భూమి హక్కులపై, వాటి అమలుపై 24 సంవత్సరాలుగా అనేక పోరాటాలు చేస్తూ వచ్చామన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ధరణి చట్టం ఏర్పడిందన్నారు. ఈ చట్టం ద్వారా సంపన్నులకే లాభం జరిగిందని పేర్కొన్నారు. పేదలు భూమిపై హక్కు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో తిరందాసు ప్రవీణ్‌కుమార్, కరుణాకర్ దేశాయ్, తెలంగాణ సోషల్ మీడియా కన్వీనర్, హైకోర్టు సీనియర్ న్యాయవాది జీవన్‌కుమార్, కంచుకట్ల సుభాష్, గ్రాస్ అధ్యక్షుడు, ఫ్లోరోసిస్ విముక్తి పోరాట సమితి రాష్ట్ర కన్వీనర్ కంచుకంట్ల సంపత్, మహేశ్వరం సతీష్, పగడాల లింగయ్య, గొట్టిముక్కల ప్రకాష్, రామకృష్ణయ్య, యాదయ్య, శేఖర్, వెంకటేష్, రాములు, మాజీ ఉపసర్పంచ్ దేవనపల్లి ధర్మయ్య, లచ్చయ్య, యాదయ్య, జంగయ్య పాల్గొన్నారు.

ఘనంగా సంత్ రవిదాస్ జయంతి

చిట్యాల, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): శ్రీసంత్ శిరోమణి గురు రవిదాస్ మహరాజ్ జయంతిని బుధవారం చిట్యాలలో సమగర మోచి కుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సమాజంలోని మూఢ నమ్మకాలను రూపుమాపడానికి ఆయన చేసిన కృషిని కొనియాడారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాస శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు మాస రమేష్, మండల అధ్యక్షుడు మాస జగన్, చంద్రగిరి దుర్గేష్, ఫుట్‌వేర్ సంఘం అధ్యక్షుడు చంద్రగిరి రవికుమార్ పాల్గొన్నారు.

ఎంపీటీసీల ఓటర్ల జాబితా విడుదల

మర్రిగూడ, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 10 ఎంపీటీసీ స్థానాల ఓటర్ల జాబితాను బుధవారం ఎంపీడీవో మున్నయ్య విడుదల చేశారు. ఈ మేరకు మండల పరిషత్ కార్యాలయం నోటీస్ బోర్డుపై ఓటరు జాబితాను ప్రదర్శించారు. మండలంలోని 18 గ్రామపంచాయతీ పరిధిలో 10 ఎంపీటీసీ స్థానాల్లో 30,847 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. మండలంలో 58 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 10 ఎంపీటీసీ స్థానాలైన దామెరభీమనపల్లిలో 3666, వట్టిపల్లి 3690, మర్రిగూడ 3117, తిరుగండ్లపల్లి 2443, యరగండ్లపల్లి 3735, శివన్నగూడ 3071, లెంకలపల్లి 2773, సరంపేట 2443, రాంరెడ్డిపల్లి 3806, ఖుదాభక్ష్‌పల్లి 3806 ఓటర్లు ఉన్నట్లు తెలిపారు. అందులో మహిళలు 15,215, పురుషులు 15,632 మంది ఓటర్లు ఉన్నారని వివరించారు.

● శాలిగౌరారం: శాలిగౌరారం మండలంలో 24 గ్రామపంచాయతీలకు 13 ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయని శాలిగౌరారం ఇన్‌చార్జి ఎంపీడీవో బానోతు సుధాకర్ తెలిపారు. శాలిగౌరారం మండలంలో 230 వార్డులకు గాను పురుష ఓటర్లు 20,200, మహిళా ఓటర్లు 20,652, థర్డ్ జెండర్లు 3, మొత్తం 40,855 మంది ఓటర్లు ఉన్నట్లు పేర్కొన్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి 230 పోలింగ్ కేంద్రాలు, ఎంపీటీసీ ఎన్నిలకు సంబంధించి 70 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. ఎంపీటీసీల వారీగా ఓటర్లు ఇలా ఉన్నారు. మనిమద్దె 3556, గురజాల 2707, చిత్తలూరు 2941, శాలిలింగోటం 1644, శాలిగౌరారం 3709, బైరవునిబండ 3558, ఆకారం 2948, వల్లాల 3021, అడ్లూర్ 2550, ఉట్కూర్ 4184, మాదారం 2679, ఇటుకులపహాడ్ 4643, పెర్కకొండారం 2634 మంది ఓటర్లు ఉన్నట్లు ఎంపీడీవో సుధాకర్ తదితరులు తెలిపారు.

జిల్లాలో ఆధ్యాత్మిక సందడి

నార్కట్‌పల్లి, కనగల్, నల్లగొండకల్చరల్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. పలు ఆలయాల్లో ఆలయ బ్రహ్మోత్సవాల్లో బుధవారం స్వామివారి కల్యాణమహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కల్యాణాన్ని తిలకించారు.

● నార్కట్‌పల్లి మండలంలో గోపలాయపల్లి గుట్టపై గల వేణుగోపాలస్వామి దేవస్థానంలో వార్షిక అధ్యయన, బ్రహ్మోత్సవాల్లో భాగంగా వేణుగోపాలస్వామి తిరుకల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. కల్యాణానికి మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి హాజరై స్వయంగా స్వామివారి అశ్వవాహన పల్లకిని మోశారు. ఆలయ అనువంశిక ధర్మకర్త కోమటిరెడ్డి మోహన్‌రెడ్డి రాజేశ్వరి దంపతులు ముత్యాల తలంబ్రాలు అందజేశారు. తొలుత ప్రధానాలయం నుంచి అశ్వవాహనంపై స్వామి, అమ్మవార్లను పల్లకి సేవలో కల్యాణవేదిక వద్దకు తీసుకువచ్చారు. అనంతరం నిర్వహించిన ఎదుర్కోలు ఉత్సవం అలరించింది. ప్రధాన యాజ్ఞికుడు ప్రతాపురం మత్స్యగిరి స్వామి పర్యవేక్షణలో అర్చక బృందం వెంకటాచార్యులు, కృష్ణమాచార్యుల శిష్య బృందం కల్యాణతంతును నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రం పాడి పంటలతో సుభిక్షంగా ఉండేలా మా కుటుంబ ఇష్ట దైవం వారిజాల వేణుగోపాలస్వామిని వేడుకున్నట్లు తెలిపారు. స్వామివారి దయతో బీ.వెల్లెంల ప్రాజెక్టును ప్రారంభించుకున్నామని, మే నెల నాటికి మొదటి లక్ష ఎకరాలకు నీళ్లందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఎండోమెంట్ సీజీఎఫ్ నిధులతో పాటు ప్రభుత్వ నిధులతో గోపలాయపల్లి దేవస్థానాన్ని అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. సహ చట్టం మాజీ ప్రధాన కమిషనర్ డాక్టర్ వర్రె వెంకటేశ్వర్లు కుటుంబ సమేతంగా హాజరయ్యారు. దాతల సహకారంతో భక్తులకు అన్నదానం చేశారు. ఈ వేడుకకు ఆర్టీఐ మాజీ కమిషనర్ డాక్టర్ వర్రె వెంకటేశ్వర్లు, తెలంగాణ హోటల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సద్ది వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యే వీరేశం సతీమణి వేముల పుష్ప, కోమటిరెడ్డి గోపాల్‌రెడ్డి, ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ బి.సుమతి, ఆలయఈవో నాగిరెడ్డి, ఆర్టీఐ కమిషనర్, కాంగ్రెస్ నాయకులు బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, దైద రవీందర్, బత్తుల ఊశయ్య, దూదిమెట్ల సత్తయ్య, పాశం శ్రీనివాస్‌రెడ్డి, సట్టు సత్తయ్య, వడ్డే భూపాల్‌రెడ్డి, దార యాదయ్య, గోసుల భద్రాచలం, స్రవంతి, దార ఈశ్వరయ్య, ప్రజ్ఞాపురం సత్తి, సంపత్ పాల్గొన్నారు.


నార్కట్‌పల్లిలో అశ్వవాహన పల్లకిని మోస్తున్న మంత్రి వెంకట్‌రెడ్డి


నార్కట్‌లపల్లి : కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు


పడిమర్రిలో కల్యాణాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

● కనగల్ మండలంలోని పగిడిమర్రి గ్రామంలో గల శ్రీసీతారామ లక్ష్మణ, అంజనేయ, గోవిందాంబ సమేత శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి, శ్రీరేణుకా ఎల్లమ్మ ఆలయ బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. కల్యాణాన్ని వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ కన్నులపండువగా జరిగింది. మాజీసర్పంచులు గోలి జగాల్‌రెడ్డిరజిత దంపతులు, కృష్ణవేణి కృష్ణారెడ్డి దంపతులు పట్టువస్త్రాలు, తలంబ్రాలు అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు గోలి నర్సిరెడ్డి, ఇడుకుళ్ల రవీందర్, మాజీ ఎంపీటీసీ వెంకట్‌రెడ్డి, సింగం సత్తయ్య, నర్సిరెడ్డి, శేఖర్‌రెడ్డి, కోట్ల వెంకన్న, షణ్ముఖచారి, అద్దంకి రవీందర్, భూషణాచారి, జానయ్య తదితరులు పాల్గొన్నారు.

● నల్లగొండ పట్టణంలోని మిర్యాలగూడ రోడ్డు ఆనంద్‌నగర్‌లో గల భూనీల సమేత వేంకటేశ్వరస్వామి దేవాలయంలో స్వామివారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. స్వామివారి ఆలయ బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయ ప్రధానఅర్చకుడు కారంపూడి రఘునందనాచార్యుల ఆధ్వర్యంలో రుత్వికులు లక్ష్మీనర్సింహచార్యుల వేద మంత్రోచ్చారణలతో ప్రత్యేక పూజలు చేశారు. మంగళవాయిద్యాల నడుమ స్వామివారు అమ్మవారి మెడలో మంగళసూత్ర ధారణను శాస్త్రోక్తంగా జరిపించారు. ఎన్ఆర్ఐ గాదె అరుణగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో భక్తులందరికీ అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ మారం గోపాల్‌రెడ్డి, కార్యదర్శి యాద వాసుదేవ్, సభ్యులు మేరెడ్డి యాదగిరిరెడ్డి, తండు పిచ్చయ్య గౌడ్, సూర్య నారాయణరాజు, భక్తులు పాల్గొన్నారు.

వెల్ఫేర్ బోర్డు అడ్వైజరీ కమిటీని నియమించాలి



సమావేశంలో మాట్లాడుతున్న వంగూరి రాములు

నల్లగొండరూరల్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మికుల వెల్ఫేర్ బోర్డు అడ్వైజరీ బోర్డును వెంటనే నియమించాలని తెలంగాణ బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్ (సీఐటీయూ) రాష్ట్ర గౌరవ అధ్యక్షులు వంగూరి రాములు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని దొడ్డి కొమరయ్య భవనంలో బుధవారం నిర్వహించిన సంఘ సమావేశంలో ఆయన మాట్లాడారు. అనేక పోరాటాల ఫలితంగా సాధించుకున్న భవన నిర్మాణ వెల్ఫేర్ బోర్డును నిర్వీర్యం చేయడానికి కేంద్రప్రభుత్వ ఆదేశాలతో రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తోందని విమర్శించారు. వెల్ఫేర్ బోర్డు ద్వారా అమలవుతున్న ప్రమాద బీమా, సహజ మరణం, శాశ్వత, పాక్షిక అంగవైకల్యం తదితర సంక్షేమ పథకాలను బీమా కంపెనీలకు టెండర్ల ద్వారా అప్పజెప్పాలని చూస్తోందని విమర్శించారు. కేంద్రప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను వెంటనే వెనక్కి తీసుకోవాలని, లేనిచో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఆయన హెచ్చరించారు. సమావేశంలో నాయకులు, చిన పాక లక్ష్మీనారాయణ, అద్దంకి నర్సింహ, ఎస్‌కె. బషీర్, సత్యనారాయణ, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

యువతకు క్రీడలు ఎంతో అవసరం


కబడ్డీ పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

● డీఎస్పీ శివరాంరెడ్డి

నల్లగొండ, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): యువకుల్లో ఐక్యమత్యాన్ని పెంచేందుకు క్రీడలు ఎంతో దోహదం చేస్తాయని నల్లగొండ డీఎస్పీ కె.శివరాంరెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎన్జీ కళాశాల మైదానంలో 'మిషన్ పరివర్తన్ - యువతేజం' ఆధ్వర్యంలో బుధవారం నల్లగొండ డివిజన్ స్థాయి కబడ్డీ పోటీలను నిర్వహించారు. ఆ పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. క్రీడలతో చెడు వ్యసనాలు దూరమవుతాయని, ఎదురయ్యే సమస్యలను సమర్థవంతంగా ఎదుర్కొంటారన్నారు. ఎస్పీ శరత్‌చంద్రపవార్ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'మిషన్ పరివర్తన్ - యువతేజం' విజయవంతంగా కొనసాగుతుందన్నారు. అనంతరం కబడ్డీ పోటీలను నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో వన్‌టౌన్, టూటౌన్ సీఐలు ఏవిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, రాఘవరావు, శాలిగౌరారం సీఐ కొండల్‌రెడ్డి, ట్రాఫిక్ సీఐ రాజు, ఉమెన్ పోలీస్‌స్టేషన్ సీఐ కరుణాకర్, వన్‌టౌన్, టూటౌన్ ఎస్ఐలు శంకర్, నాగరాజు, సందీప్ రెడ్డి, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ రాజిరెడ్డి కుటుంబానికి అండగా ఉంటా : మంత్రి

తిప్పర్తి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): పార్టీ కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటానని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. నల్లగొండ జిల్లా తిప్పర్తి మండలం మామిడాల గ్రామ మాజీ సర్పంచ్ కందిమళ్ల రాజిరెడ్డి (78) రెండు రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందారు. మంగళవారం గ్రామంలో నిర్వహించిన అంత్యక్రియల్లో మంత్రి కోమటిరెడ్డి పాల్గొని నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో రాజిరెడ్డి మామిడాల ఉమ్మడి గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా వ్యవహరించారని, ఆ సమయంలో పార్టీకి చేసిన సేవలను కొనియాడారు. రాజిరెడ్డి అనారోగ్యంతో హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్న సమయంలో అతని ఇంటికి వెళ్లి పరామర్శించానని, కుటుంబానికి తన సహాయ సహకారాలు ఉంటాయని తెలిపారు. అంత్యక్రియల్లో భాగంగా యాపలగూడెం గ్రామ పంచాయతీ కూడలి నుంచి చితి వరకు మంత్రి పాడె మోశారు. రాజిరెడ్డికి నలుగురు కుమార్తెలు, కుమారుడు కాగా, ఆయన పదేళ్ల క్రితమే అమెరికాలో స్థిరపడ్డాడు. కుమారుడు అమెరికా నుంచి రావడం ఆలస్యం కావడంతో అంత్యక్రియల క్రతువును రెండు రోజులపాటు నిలిపారు.

జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో 'ప్రగతి' విద్యార్థుల ప్రతిభ


కార్తీక్


సమీర


శివ

నల్లగొండటౌన్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): జేఈఈ ఫలితాలలో ప్రగతి జూనియర్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభను కనబరిచారు. కళాశాలకు చెందిన విద్యార్థులు టి. కార్తీక్ 96.88, కె. సమీరా 92.18, ఎం.శివ 92.01, కె.హసీన 91.79, బి. భవాని 91.57, కె.యశ్వంత్ 91.32, డి. చరణ్ 91.12, పర్సంటైల్ సాధించారు. సబ్జెక్టుల వారీగా మ్యాథ్స్‌లో టి.కార్తీక్ 99.52, ఎండీ. ఖాజానజీరుద్దీన్ 97.01, సదాఫ్ 97.38, సైమనూరీన్ 96.78, కె. యశ్వంత్ 96.32, బి. శిరీష 96.02, ఎ.తేజస్విని 95.97, డి.చరణ్, 95.66, టి.తరుణ్‌కుమార్ 95.60, ఎస్.తనయ్‌కుమార్ 94.88, ఎం.శివ 94.05. కె.హసిని 94.05, బి.లహరి 93.15, బి.భవాని 92.92, కె.సమీరా, కె.స్టాలిన్ 92.21, సీహెచ్. జశ్వంత్ 91.27, బి.మేఘన90.70, ఎల్.నితిన్‌సాయి 90.54, బి.శ్రీను 90.44, పర్సంటైల్ సాధించారు. ఫిజిక్స్‌లో బి.కార్తీక్ 93.93, కె.హాసిని 93.03, ఎం.శివ 91.23, పర్సంటైల్, కెమిస్ట్రీలో బి.నితిన్ 95.20, కె.సమీర 95.20, డి.చరణ్ 94.26, కె.యశ్వంత్ 91.84, బి.శిరీష 91.18, పర్సంటైల్, 80కి పైగా పర్సంటైల్‌కు పైగా 41 మంది విద్యార్థులు సాధించారు. ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన కళాశాల విద్యార్థులను వారి తల్లిదండ్రులను అందుకు సహకరించిన అధ్యాపక బృందానికి చైర్మన్ చందా కృష్ణమూర్తి, డైరెక్టర్లు ఎ.నరేందర్‌బాబు, ఎన్. శశిధర్‌రావు, చందా శ్రీనివాస్, పైళ్ల రమేష్‌రెడ్డి అభినందించారు. పట్టుదల, క్రమశిక్షణతో కూడిన ప్రణాళికాబద్ధమైన విద్యాబోధన, అంకితభావం కలిగిన యాజమాన్యం, అధ్యాపక బృందం కృషితో ఉత్తమ ఫలితాలు సాధించినట్లు చైర్మన్ చందా కృష్ణమూర్తి తెలిపారు.

విస్తరణ పనులను వెంటనే పూర్తి చేయాలి

నార్కట్‌పల్లి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): విస్తరణ పనులను వెంటనే పూర్తి చేయాలని అఖిలపక్ష నాయకులు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో బుధవారం నిర్వహించిన అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. పట్టణంలో నిలిచిపోయిన రోడ్డు విస్తరణ పనులకు నిరసనగా ఈ నెల 14వ తేదీన నార్కట్‌పల్లి పట్టణంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టాలని అఖిలపక్షం నిర్ణయించింది. రోడ్డు విస్తరణ పనులు నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అయినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని అన్నారు. సమావేశంలో వివిధ పార్టీల నాయకులు చిరుమర్తి యాదయ్య, చింతపల్లి బయ్యన్న, వెంపటి శ్రీనివాస్, మేడబోయిన శ్రీనివాస్, లింగాల యాదయ్య, కొప్పు శ్రవణ్, ఆమనగంటి అయిలయ్య, గూడూరు అంజిరెడ్డి, మునుకుంట్ల గణేష్, నడింపల్లి శ్రవణ్, రామలింగం, వెంకట్ పాల్గొన్నారు.


మాదిగలు మరో పోరాటానికి సిద్ధం కావాలి

శాలిగౌరారం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 32 లక్షల మందికి పైగా ఉన్న మాదిగలకు 11శాతం వాటా కోసం మందకృష్ణమాదిగ ఆధ్వర్యంలో మాదిగలంతా మరో పోరాటానికి సిద్ధం కావాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బోడ సునీల్ మాదిగ పిలుపునిచ్చారు. మండలంలోని పెర్కకొండారం గ్రామానికి చెందిన మాదిగలు హైదరాబాద్ వరకు పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణకు అసెంబ్లీలో ఆమోదం తెలిపినందుకు 'లక్ష డప్పులు-వేల గొంతులు' మహా ప్రదర్శన తాత్కాలికంగా వాయిదా వేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు వంగూరి ప్రసాద్, మస్తాన్, జానయ్య, అంజయ్య, ప్రతాప్, అనుదీప్, సైదులు, రవి, శివశంకర్‌గౌడ్, కిరణ్ పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి

***

ANDHRAJYOTHY



నల్లగొండ

5 గురువారం 13 ఫిబ్రవరి 2025

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ : 18004251442

యాదాద్రి : 1800 425 7106

సూర్యాపేట : 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 60

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.130	195	220
సూర్యాపేట	రూ.130	200	210
నల్లగొండ	రూ.125	195	210

ఉష్ణోగ్రత గరిష్ఠం 33.0 , కనిష్ఠం 19.4

కోళ్ల వైరస్ భయంతో చికెన్ వినియోగం తగ్గింది. రాష్ట్రంలో ప్రత్యేకించి ఉమ్మడి జిల్లాలో కోళ్లకు ఎలాంటి వైరస్, వ్యాధి సోకలేదని అధికారులు స్పష్టంగా పేర్కొంటున్నా, విక్రయాల్లో తగ్గుదల నమోదైంది. ఏపీ రాష్ట్ర సరిహద్దు ప్రాంతం కావడంతో సూర్యాపేట జిల్లాలో చికెన్ విక్రయాలపై కొంత ప్రభావం ఎక్కువగా ఉండగా, నల్లగొండ, యాదాద్రి జిల్లాల్లో సగటు కంటే 20శాతం వరకు విక్రయాలు తగ్గాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కోళ్లఫాంలను పశుసంవర్ధకశాఖ అధికారులు తనిఖీ చేసి ఎక్కడా వైరస్ లక్షణాలు లేవని నిర్ధారించారు.

– (ఆంధ్రజ్యోతి ప్రతినిధి, నల్లగొండ)



పేట జిల్లా రాష్ట్ర సరిహద్దు రామాపురం వద్ద ఏర్పాటుచేసిన చెక్‌పోస్ట్



చికెన్ విక్రయాలు తగ్గాయ్

- సగటున 20శాతానికిపైగా తగ్గుదల
- ఉమ్మడి నల్లగొండ జిల్లాలో వైరస్ భయంలేదంటున్న పశుసంవర్ధకశాఖ
- ప్రతీ కోళ్లఫామ్‌ను తనిఖీ చేస్తున్న అధికారులు
- నేటి నుంచి రూ.5వరకు పెరగనున్న చికెన్ ధర



ఓ వైపు చికెన్ విక్రయాలు మందగిస్తే గురువారం నుంచి చికెన్ ధర కిలోకు రూ.3 నుంచి రూ.5 వరకు పెంచేందుకు పౌల్ట్రీ సమాఖ్య నిర్ణయించింది. కోడిగుడ్ల ధరలు, విక్రయాలపై మాత్రం ఎలాంటి ప్రభావం కనిపించలేదు. విక్రయాలు, ధరలు యథావిధిగానే ఉన్నాయి. మార్కెట్లో పరిస్థితి ఇలా ఉంటే పశుసంవర్ధకశాఖ అధికారులు మాత్రం ఉమ్మడి జిల్లాలో ఎలాంటి ఇబ్బందిలేదని, చికెన్, కోడిగుడ్లను ఆహారంలో తీసుకోవచ్చని, భయపడాల్సిన పనిలేదని స్పష్టం చేశారు.

నేటి నుంచి పెరగనున్న ధరలు

ఓ వైపు ఏపీలో బర్డ్‌ఫ్లూతో చికెన్ ధరలు తగ్గుతాయనుకుంటే ఫామ్‌గేటు ధరలు మాత్రం గురువారం నుంచి పెరుగుతున్నాయి. ఈ మేరకు పౌల్ట్రీదుకాణాల నిర్వాహకులకు ఇప్పటికే సమాచారం అందింది. ప్రస్తుతం ఫామ్‌గేట్ ధర లైవ్‌బర్డ్‌కి కిలో రూ.97 ఉంటే గురువారం నుంచి రూ.100కు పెరగనుంది. అదేవిధంగా చికెన్‌ధర సైతం కిలోకి రూ.4 పెంచినట్టు చికెన్ దుకాణదారులు తెలిపారు. ప్రస్తుతం చికెన్‌ధర లైవ్‌బర్డ్ కిలో రూ.97 ఉంటే, గురువారం నుంచి రూ.100కు, చికెన్ కిలో రూ.173 నుంచి రూ.177కు, స్కిన్‌లెస్ ధరలు కిలో రూ.196 నుంచి రూ.201కి పెరుగుతాయని చెబుతున్నారు. కోడిగుడ్ల డజన్ రూ.60గానే కొనసాగుతోంది.

వైరస్ భయంతో తగ్గిన విక్రయాలు

ఏపీ రాష్ట్రంలో బర్డ్‌ఫ్లూ కారణంగా కోళ్లు చనిపోతున్నాయనే కారణంతో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో చికెన్ విక్రయాలు తగ్గాయి. ఉమ్మడి జిల్లాలోని ప్రధాన పట్టణాల్లో బుధవారం చికెన్, కోడిగుడ్ల కొనుగోళ్ల పరిస్థితిని 'ఆంధ్రజ్యోతి' క్షేత్రస్థాయిలో పరిశీలించింది. నల్లగొండలో ఒక చికెన్ దుకాణం నిర్వాహకుడు సాధారణ పరిస్థితుల్లో సగటున 100 నుంచి 130కిలోల వరకు చికెన్ విక్రయించగా, బుధవారం స్వల్పంగా తగ్గి 100 కిలోల లోపే విక్రయించినట్టు తెలిపాడు. ఏపీ సరిహద్దు ప్రాంతాలైన సూర్యాపేట, కోదాడ పట్టణాల్లో మాత్రం సగటు అమ్మకాల కంటే 25 నుంచి 30శాతం మేర విక్రయాలు తగ్గాయి. సూర్యాపేట పట్టణంలో సుమారు 150 వరకు చికెన్ దుకాణాలుంటే, అందులో బుధవారం 40 దుకాణాల వరకు స్వచ్ఛందంగా మూసివేశారు. నల్లగొండ, భువనగిరి జిల్లాల్లో మాత్రం ఈవ్యాధి ప్రభావంతో కొనుగోళ్లు 20శాతం మేర మందగించినా దుకాణాలన్నీ యథావిధిగానే కొనసాగాయి..

- మిగతా 6వ పేజీలో...

సరిహద్దులో కోళ్ళ రవాణా వాహనాల తనిఖీ

(ఆంధ్రజ్యోతి, కోదాడ రూరల్, నాగార్జునసాగర్, మిర్యాలగూడ రూరల్): ఏపీ రాష్ట్రంలో కోళ్లకు బర్డ్‌ఫ్లూ నేపథ్యంలో బుధవారం కోదాడ మండలం రామాపురం క్రాస్‌రోడ్డు చెక్‌పోస్టు వద్ద ఏపీ నుంచి వచ్చే కోళ్ల వాహనాలను తనిఖీ చేసి తిప్పి పంపించారు. బర్డ్‌ఫ్లూ వైరస్ వ్యాప్తికి వాహనాలు కూడా కారణం అవుతాయని, వాటిని శానిటైజ్ చేయాలని ఏవైనా కోళ్లు మృతిచెందితే గుంత తీసి, సున్నం పోసి పూడ్చాలని, కాల్వలో, ఆరుబయట ప్రాంతాల్లో పడేయకూడదని సూర్యాపేట జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి శ్రీనివాసరావు తెలిపారు. నాగార్జునసాగర్ పైలాన్ కాలనీ కొత్త వంతెన వద్ద పోలీస్, అటవీశాఖ, పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో చెక్‌పోస్టును ఏర్పాటు చేశారు. ఇక్కడ అధికారులు మూడు షిఫ్టులుగా 24 గంటలు విధులు నిర్వహిస్తున్నారు. ఇక్కడ వెటర్నరీ డాక్టర్ కేశవ్ అజ్మీరా, అటవీ శాఖ అధికారి రవీందర్ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహిస్తున్నారు. అదేవిధంగా మిర్యాలగూడ మండలంలోని అవంతీపురం, సుబ్బారెడ్డిగూడెం, రాయినిపాలెం గ్రామాల్లోని కోళ్ల ఫామ్‌లను పశుసంవర్ధశాఖ అధికారి దుర్గారమాదేవి ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు.



బీర్ల ధరలు పెరిగాయ్

- రూ.30 నుంచి రూ.40 వరకు పెంపు
- మద్యం ప్రియులపై రూ.4.60కోట్ల అదనపు భారం
- అమలులోకి వచ్చిన నూతన ధరలు

సూర్యాపేటక్రైం, ఫిబ్రవరి 12, (ఆంధ్రజ్యోతి): ఎండాకాలంలో బీరు ప్రియులకు గట్టి దెబ్బ తగిలింది. సాధారణంగా వేసవి కాలంలో ఎక్కువగా చాలా మంది మద్యం ప్రియులు బీర్లు తాగుతుంటారు. సాధారణ రోజుల్లో మద్యం తీసుకునేవారు వేసవిలో మాత్రం బీర్లతో ఎండ తాపం నుంచి తాత్కాలిక ఉపశమనం పొందుతుంటారు. కాగా, ప్రభుత్వం తాజాగా బీర్ల ధరలు పెంచి వారిపై అదనపు భారాన్ని మోపింది. దీంతో ఒక్కో బీరు ధర కనిష్ఠంగా రూ.30 నుంచి గరిష్ఠంగా రూ.40 వరకు పెరిగింది. దీంతో ఎక్కువగా బీర్లు ఇష్టపడేవారిపై అదనపు ఆర్థిక భారం పడనుంది. ప్రభుత్వం పెంచిన బీర్ల ధరలు ఇప్పటికే అమలులోకి వచ్చాయి.

అమలులోకి నూతన ధరలు

ప్రభుత్వం పెంచిన బీర్ల ధరలు అమలులోకి వచ్చాయి. ఇప్పటికే మద్యం డిపోల్లో ఉన్న పాత స్టాక్‌ను కూడా పెంచిన ధరల ప్రకారం విక్రయించాలని ప్రభుత్వం ఆదేశించింది. మద్యం దుకాణాలకు కూడా బీరు



బాటిళ్లపై పాత ఎంఆర్‌పీ ధర ఉన్నా, వారి నుంచి ప్రభుత్వం పెంచిన ధరల ప్రకారం డబ్బు వసూలు చేయనుంది. దీంతో పాత స్టాక్‌ను కూడా నూతన ధరలకు విక్రయించాలని ఆదేశించింది. పెరిగిన ధరల ప్రకారం కింగ్‌ఫిషర్ లైట్ బీరు రూ.180, కింగ్ ఫిషర్ స్ట్రాంగ్ బీరు రూ.190, కింగ్‌ఫిషర్ ఆల్ట్రా బీరు ధర రూ.250, బడ్‌వైజర్ మాగ్నమ్ బీరు ధర రూ.260, గ్రీన్‌డీర్ బీరు ధర రూ.180, రాయల్ చాలెంజ్ బీరు రూ.180, నాకవుట్ బీరు రూ.190, బడ్‌వైజర్ లైట్ బీరు...

- మిగతా 6వ పేజీలో...

పెరిగిన ధరల ప్రకారం విక్రయించాలి



జిల్లాలో ప్రభుత్వం పెంచిన ధర ప్రకారం బీర్లను విక్రయించాలి. పాత స్టాక్‌ను కూడా నూతన ధరలకు విక్రయించాలి. విస్కీ ధరలు మాత్రం పెరగలేదు. ఎవరైనా విస్కీని అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటాం. బీరు బాటిళ్లపై పాత ఎమ్మార్పీ ఉన్నా పెరిగిన ధరల ప్రకారం విక్రయాలు జరుగుతాయి. నిబంధనలు పాటించి మద్యం విక్రయాలు చేయాలి.


- లక్ష్మానాయక్, సూర్యాపేట ఈఎస్



17 ఏళ్ల నిరీక్షణకు తెర

- ఫలించిన డీఎస్సీ-2008 అభ్యర్థుల ఆశలు
- ఉమ్మడి జిల్లాలో 158 మందికి ఉపాధ్యాయ ఉద్యోగాలు
- నేడో, రేపో నియామక ఉత్తర్వులు
- ప్రస్తుతానికి మూలవేతనమే.. ఇతర అలవెన్సులు లేవు

•6లో..



కందులు కొనేవారేరీ?

- మోత్కూరులో కొనుగోలు కేంద్రం తెరిచి 17 రోజులు
- ఇప్పటివరకు బస్తా కొనుగోలు చేయని వైనం
- మార్కెట్ బ్యానర్ తొలగించి రైతుల నిరసన
- తిరుమలగిరి మార్కెట్‌కు వెళ్తున్న రైతులు

•7లో..

పునరావాసం కల్పించాలని

పనుల అడ్డగింత



నర్సిరెడ్డి గూడెం భూ నిర్వాసితులతో మాట్లాడుతున్న సీఐ నవీన్ కుమార్

మర్రిగూడ, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): పునరావాసం, ఆర్అండ్ఆర్ ప్యాకేజీ అందించాలని భూ నిర్వాసితులు డిమాండ్ చేశారు. మర్రిగూడ మండలంలోని చర్లగూడెం రిజర్వాయర్ పనులను బుధవారం చర్లగూడ ముంపు గ్రామ బాధితులైన నర్సిరెడ్డిగూడెం నిర్వాసితులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ నెలరోజుల అనంతరం పునరావాసం,ఆర్అండ్ఆర్ ప్యాకేజీ రాని వారికి అన్ని కల్పిస్తామని చెప్పారని,కాని ఇప్పటివరకు తమకు పునరావాసానికి సంబంధించిన ధ్రువపత్రాలు అందించలేదని అన్నారు.

అందుకే పనులను అడ్డుకున్నట్లు బాధితులు పేర్కొన్నారు. విషయం తెలుసుకున్న సీఐ నవీన్‌కుమార్, ఎస్ఐ కృష్ణారెడ్డి సంఘటనా స్థలానికి చేరుకొని భూనిర్వాసితుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మీకు తప్పనిసరిగా పునరావాసం, ఆర్అండ్ఆర్ ప్యాకేజీ వస్తుందని, పనులకు సహకరించాలని బాధితులకు నచ్చజెప్పా రు. అయినా బాధితులు వినకుండా వారు పనులు అడ్డుకున్నారు. అనంతరం సీఐ నవీన్‌కుమార్ హామీతో పనులు జరగడానికి బాధితులు సహకరించారు.

మెనూ ప్రకారం

పౌష్టికాహారం అందించాలి

ఐసీడీఎస్ పీడీ కృష్ణవేణి

మునుగోడురూరల్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): మెనూ ప్రకారం పిల్లలకు పౌష్టికాహారం అందించాలని, అంగన్‌వాడీ కేంద్రాల్లో టీచర్లు లేకపోతే చర్యలు తప్పవని ఐసీడీఎస్ పీడీ కృష్ణవేణి హెచ్చరించారు. మండలంలోని చీకటిమామిడి అంగన్‌వాడీ కేంద్రాన్ని మంగళవారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్రాల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠినచర్యలు తప్పవని అన్నారు. ప్రీస్కూల్ పిల్లల తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇచ్చి పిల్లలందరూ అంగన్‌వాడీ కేంద్రానికి హాజరయ్యేలా చూడాలన్నారు. మెనూ ప్రకారం వంట చేశారా? లేదా? అని తెలుసుకున్నారు. బియ్యం, పప్పు, గుడ్ల నాణ్యతను తనిఖీ చేశారు. పిల్లలకు అందించే బాలామృతం ప్లస్ తినిపిస్తున్నారా లేదా అని టీచర్‌ను అడిగి తెలుసుకున్నారు. అన్ని అంగన్‌వాడీ కేంద్రాల పరిసరాలు, పరిశుభ్రంగా ఉండాలని అన్నారు. అనంతరం టీచర్లకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఏసీడీపీవో వెంకటమ్మ, సూపర్‌వైజర్లు యాదమ్మ ఉన్నారు.

పూర్వగిరీశుడికి శ్రీపుష్పయాగం

•7లో..

ఇందిరమ్మ ఇంటి మోడల్ నిర్మించాలి

కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ టౌన్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు అవగాహన కల్పించేందుకు పట్టణాలు, మండల కేంద్రాల్లో ఇందిరమ్మ ఇళ్ల మోడల్ నిర్మించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. కలెక్టర్ కార్యాలయ ఆవరణలో నిర్మిస్తున్న ఇందిరమ్మ మోడల్ ఇంటిని ఆమె బుధవారం పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ, కలెక్టరేట్‌లో నిర్మించిన ఇందిరమ్మ మోడల్ ఇల్లు బాగుందని, ఇదేవిధంగా జిల్లా వ్యాప్తంగా అన్ని మండల కేంద్రాలు, ముఖ్యమైన పట్టణాల్లో ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఇలాంటి మోడల్ ఇళ్లు నిర్మించాలన్నారు. కార్యక్రమంలో గృహ నిర్మాణశాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ రాజ్‌కుమార్, సర్వే ల్యాండ్ రికార్డ్స్ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

విధుల పట్ల అలసత్వం వహిస్తే కఠిన చర్యలు

గుర్రంపోడు: ప్రాథమిక వైద్య, ఆరోగ్య కేంద్రాలను సరైన విధంగా నిర్వహించాలని లేదంటే చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఇలా త్రిపాఠి హెచ్చరించారు. గుర్రంపోడు ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె ఆస్పత్రి సిబ్బంది రిజిస్టర్, మందులను పరిశీలించి రికార్డులు సరిగా లేకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. అంతేకాక కలెక్టర్ ఆస్పత్రిలో పనిచేస్తున్న నర్సు నాగరాణిని అడిగిన ప్రశ్నలకు సరైన సమాధానం ఇవ్వకపోవడం, స్టాఫ్ వివరాలు సరిగా లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నర్సు నాగమణికి షోకాజ్ నోటీస్ జారీ చేయాలని ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా పీహెచ్‌సీలను సరిగా నిర్వహించాలని లేకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. ఆస్పత్రుల్లో సాధారణ ప్రసవాలు పెంచాలని, మాతాశిశు మరణాల సంఖ్య తగ్గించాలని, అన్ని రకాల మందులు, వ్యాక్సిన్‌ను సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. ఆమె వెంట తహసీల్దార్ ఫరీదుద్దీన్, ఆర్ఐ నజీర్ ఉన్నారు.



కలెక్టరేట్‌లో ఇందిరమ్మ ఇంటి మోడల్ పరిశీలిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

ఉద్యానవన పంటలను ప్రోత్సహించాలి

కొండమల్లేపల్లి: నూతన ఉద్యానవన పంటలను ప్రోత్సహించే దిశగా పరిశోధనలు సాగాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని ఉద్యాన వన పరిశోధన కేంద్రాన్ని ఆమె సందర్శించారు. రాళ్లు, రప్పలు ఉన్న ప్రాంతాల్లో కుంకుడు పంటలను ప్రోత్సహించాలని సూచించారు. జిల్లాలో 4300 ఎకరాల్లో బత్తాయి, 9వేల ఎకరాల్లో నిమ్మ తోటలు పటలు సాగుచేస్తున్నారని అన్నారు. మెరుగైన దిగుబడులు వచ్చేలా రైతులకు మంచి మొక్కలను అందించే విధంగా పరిశోధనల సాగాలని అభిప్రాయపడ్డారు. అంతకుముందు పరిశోధన కేంద్రం ద్వారా ఇస్తున్న శిక్షణ కార్యక్రమాలు, ఉద్యానవన కేంద్రంలో బత్తాయి, నిమ్మ పంటలకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. నర్సరీని పెంచేందుకు ప్రభుత్వానికి రూ.25లక్షలతో ప్రతిపాదనలు పంపించాలని ఆమె సూచించారు. కలెక్టర్ వెంట జిల్లా ఉద్యానవనశాఖ సహాయ సంచాలకుడు సాయిబాబా, సీనియర్ సైంటిస్ట్ రాజుగౌడ్, ట్రైనింగ్ కోఆర్డినేటర్ లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

వికసిత్ భారత్ లక్ష్యంగా బడ్జెట్



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న నాగం వర్షిత్‌రెడ్డి

బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి

నల్లగొండటౌన్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): వికసిత్ భారత్ లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం రూ.50లక్షల కోట్లతో బడ్జెట్‌ను ప్రవేశపెట్టిందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నాగం వర్షిత్‌రెడ్డి అన్నారు. బుధవారం బీజేపీ జిల్లా కార్యాలయం లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బడ్జెట్‌లో రూ.12లక్షల వరకు ఆదాయపన్ను రిబెట్ ఇవ్వడం అల్పాదాయ వర్గాలకు గొప్ప ఊరట కలిగించిందన్నారు. కేంద్ర బడ్జెట్‌పై దేశ ప్రజలు సంతోషంగా ఉన్నారని, దీనికి ఢిల్లీ ఎన్నికల్లో గెలుపే నిదర్శనమన్నారు. కిసాన్ క్రెడిట్ కార్డుల ద్వారా రైతుల రుణాల పరిమితిని రూ.3 లక్షల నుంచి రూ.5లక్షలకు పెం చిందని, పప్పు ధాన్యాల కోసం రూ.1,000 కోట్లు కేటాయించిందని, రాష్ట్రంలో పసుపు బోర్డును ఏర్పాటు చేసిందన్నారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి రూ.2.65లక్షల కోట్లు, ఉపాధి హామీకి రూ.88వేల కోట్లు, తాగునీటి వ్యవస్థకు రూ.67వేల కోట్లు కేంద్రం కేటాయించిందన్నారు. రాష్ట్రంలోని ప్రతి పల్లెకు కేంద్రంలోని మోదీ ప్రభుత్వ నిధులు అందుతున్నాయని, రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నుంచి ఒక్క రూపాయి కూడా రావడం లేదన్నారు. అర్హులైన ప్రతీ పేదవాడికి ఇల్లు కట్టించి ఇవ్వాలనే సంకల్పంతో కేంద్ర ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి జిల్లాకు చేసింది ఏమీ లేదని విమర్శించారు. పార్టీలో ఎంతోమంది సీనియర్లు ఉన్నారని, ఆశావహులు ఎక్కువగా ఉన్నప్పుడు స్వల్ప అసంతృప్తి సహజమని, జిల్లాలో తలెత్తిన అసంతృప్తిపై రాష్ట్ర నాయకత్వం మాట్లాడుతుందన్నారు. త్వరలోనే సమస్య సద్దుమణుగుతుందని పేర్కొన్నారు. సమావేశంలో బీజేపీ దళితమోర్చా రాష్ట్ర నాయకుడు చింతా ముత్యాలరావు, మైనార్టీ మోర్చా నాయకుడు షేక్ బాబా, ఓబీసీ మోర్చా నాయకుడు పాలకూరి రవిగౌడ్, జిల్లా నాయకులు కంచర్ల విద్యాసాగర్‌రెడ్డి, పోతేపాక లింగస్వామి, దాసోజు యాదగిరిచారి, రమణముదిరాజ్, మంగళపల్లి కిషన్, మోహన్‌రెడ్డి, లకడాపురం వెంకటేశ్వర్లు, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

సాంకేతిక పద్ధతులను అవలంబించాలి



ఫార్మర్స్ రైతు ప్రొడ్యూసర్స్ కంపెనీలో విదేశీ ప్రతినిధులు

కట్టంగూరు, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): రైతులు ఆధునిక సాంకేతిక పద్ధతులను ఉపయోగించి ఆర్థికంగా అభివృద్ధి చెందాలని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అగ్రికల్చరల్ ఎక్స్‌టెన్షన్ మేనేజ్‌మెంట్ ప్రతినిధులు అన్నారు. మండంలోని అయిటిపాముల జీపీ పరిధి గంగాదేవిగూడెం సమీపంలో ఉన్న కట్టంగూరు ఫార్మర్స్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ మేనేజ్ సంస్థ ప్రతినిధులు, దక్షిణఅమెరికా, దక్షిణాఫ్రికా, దక్షిణఆసియా దేశాల ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎఫ్‌పీవో సిబ్బంది నిమ్మ గ్రేడింగ్ యంత్రాన్ని, నిమ్మ ఒరుగుల తయారీ యంత్రాన్ని, పలు రకాల వ్యవసాయ పనిముట్లు, సోలార్ కోల్డ్ స్టోరేజీని, కూరగాయల మార్కెటింగ్ విధానం, ఎరువులు, పురుగుల మందు కొనుగోలు విధానాన్ని, నిమ్మకాయ పచ్చడి తయారీ, ప్యాకింగ్, నిమ్మకాయ జ్యూస్ గురించి ప్రతినిధులకు వివరించారు. తపోవనం ఆర్గానిక్ ఫార్మింగ్ సిస్టం ప్రైవేట్ లిమిటెడ్ బెంగుళూరుకు చెందిన శాస్త్రవేత్తలు పత్తి కట్టెల తో బయోచార్ విధానం ద్వారా పంట పొలాలను కర్బనశాతం పెంచుకోవచ్చని రైతులకు తెలిపారు. మహిళలకు ప్రతీక్ ఫౌండేషన్ సహకారంతో స్వచ్ఛశక్తి ఆఫ్ గ్రేడ్ సోలార్ పవర్ ప్రొడక్షన్ ప్లాంట్లు ఏర్పాటు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో నాబార్డు డీడీఎం వినయ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే నంద్యాల నర్సింహారెడ్డి, ఎఫ్‌పీవో చైర్మన్ చెవుగోని సైదమ్మ, ఐఆర్‌డీఎస్ చైర్మన్ వాడేపల్లి రమేష్, సీఈవో నరేష్, డైరెక్టర్లు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి ***
మిర్యాలగూడ
నాగార్జునసాగర్, దేవరకొండ
8 www.andhrajyothy.com ● గురువారం 13 ఫిబ్రవరి 2025

పెన్షనర్ల కరువు భత్యం మంజూరు చేయాలి

దేవరకొండ, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్ల కరువు భత్యం వెంటనే మంజూరు చేయాలని విశ్రాంత ఉద్యోగుల సంఘం దేవరకొండ నియోజకవర్గ అధ్యక్షుడు తాడిశెట్టి నర్సింహ బుధవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. నాలుగు విడతల కరువు భత్యం మంజూరు చేయకపోవడంతో ఇబ్బందులుపడుతున్నారని పేర్కొన్నారు. ప్రకటన విడుదలచేసిన వారిలో సంఘం ప్రధాన కార్యదర్శి అంకం చంద్రమౌళి, లింగయ్య, దామోదర్‌రెడ్డి, నారాయణరెడ్డి ఉన్నారు.

పారదర్శకంగా సంక్షేమ పథకాలు

చింతపల్లి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు పారదర్శకంగా అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని మాజీ ఎంపీపీ కొండూరి భవానీపవన్ కుమార్ అన్నారు. దేవరకొండలో బుధవారం ఎమ్మెల్యే బాలునాయక్‌ను ఆమె కలిశారు. కలిసిన వారిలో నాయకులు అంగిరేకుల గోవర్ధన్, శ్రీకాంత్, జగదీష్, కొండూరి రాజేష్, పాలకుర్ల కృష్ణ, మద్దెల కృష్ణ, కడారి జంగయ్య పాల్గొన్నారు.

రేషన్ కార్డు కోసం ఎదురు చూపులు

» గత నెలలో పైలెట్ ప్రాజెక్టుగా కొన్ని గ్రామాల్లో కార్డులు మంజూరు » ఎన్నికల కోడ్ అడ్డమొచ్చేనా..?

(ఆంధ్రజ్యోతి-మిర్యాలగూడ): రేషన్‌కార్డు కోసం దరఖాస్తు చేసుకున్న పేదలు మంజూరు కోసం ఎదురు చూస్తున్నారు. 11 ఏళ్లుగా పేదలకు రేషన్ కార్డులు మంజూరు కాకపోవడంతో ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ క్రమంలో కాంగ్రెస్ ప్రభు త్వం జనవరి 26 గణతంత్ర దినోత్సవం సందర్భంగా 4 సంక్షేమ పథకాలను అమలుకు సన్నాహాలు చేసింది. ముందస్తుగా మండలానికి గ్రామాన్ని పైలెట్ ప్రాజె క్టుగా ఎంపిక చేసి లబ్ధిదారుల జాబితాను సిద్ధం చేసి అమలు చేసింది. 4 సంక్షేమ పథకాల్లో ఒకటైన రేషన్‌కార్డుల మంజూరు కోసం నిరుపేద కుటుంబాల ప్రజలు ఆతృతగా ఎదురుచూస్తున్నారు. పైలెట్ గ్రామాల్లో లబ్ధిదారుల జాబితాను ప్రకటించి ఫుడ్ సెక్యూరిటీ కార్డుల నంబర్లను జారీ చేసినప్పటికీ ఈ నెల రేషన్‌ను ఇంత వరకు వారికి చేయలేదు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున మిగతా గ్రామాల ప్రజలకు కార్డులు అందుతాయా..ఈసీ కరుణిస్తుందా..నోటిఫికేషన్ ముందే ప్రకటి ంచిన పథకం కాబట్టి అమలుకు ఆటంకాలు ఉండవా అనేది ప్రజల్లో చర్చ సాగు తోంది.


డాటా ఎంట్రీని పరిశీలిస్తున్న మిర్యాలగూడ తహసీల్దార్ హరిబాబు.

	దరఖాస్తులు ఇలా..			
మండలం	గ్రామాలు	చేర్పులు	కొత్తవాటికి	మొత్తం
అడవిదేవులపల్లి	1	587	895	1,482
మిర్యాలగూడ	46	919	2,334	3,253
మిర్యాలగూడమున్సిపాలిటీ	48వార్డులు	6,685	3,899	10,584
వేములపల్లి	12	1,082	2,197	3,279
మాడ్గులపల్లి	28	1,287	3,817	5,104
దామరచర్ల	35	2,303	3,112	5,415

9 ఏళ్లుగా ఎదురుచూపు



వివాహమై 9 ఏళ్లవుతుంది. అమ్మానాన్నలకు విడిగా ఉం టున్నాం. ఇప్పటి వరకు రేషన్‌కార్డు మంజూరు కాలేదు. ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. గత నెల నిర్వహించిన గ్రామసభలో లబ్ధిదారుల జాబితాలో పేరు ఉన్నట్లు చెప్పారు. కాగా ఇంతవరకు కార్డు మంజూరు కాలేదు. వెంటనే రేషన్‌కార్డు అందించి సంక్షేమ పథకాలు అం దించేలా ప్రభుత్వం కృషి చేయాలి.

- నరేష్, అమనగల్లు, వేములపల్లి మండలం

డాటా ఎంట్రీ చేస్తున్నాం

ప్రజాపాలన, గ్రామ సభల్లో రేషన్‌కార్డుల కొత్త కార్డు లు, మార్పు చేర్పుల కోసం వచ్చిన దరఖాస్తుల డాటా ఎంట్రీ చేయిస్తున్నాం. పైలెట్ ప్రాజెక్టు గ్రామాల్లో జారీ చేసిన చేసిన కార్డులకు ఇప్పటివరకు రేషన్ ఎలాట్‌మెంట్‌కు కాలేదు. ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేసిన వెంటనే లబ్ధిదారుల జాబితా ప్రకటించి కార్డుల జారీ ప్రక్రియ చేపడుతాం.

-హరిబాబు, తహసీల్దార్, మిర్యాలగూడ

పైలెట్ ప్రాజెక్టు	గ్రామం	మంజూరైన కార్డులు
దామరచర్ల	రాజగట్టు	122
మిర్యాలగూడ	రుద్రారం	49
మాడ్గులపల్లి	దాచారం	66
అడవిదేవులపల్లి	ముదిమాణిక్యం	32
వేములపల్లి	అన్నపురెడ్డిగూడెం	46

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

వరిని అగ్గితెగులు నుంచి కాపాడుకోవాలి

● కంచర్ల మాధవరెడ్డి, ఏవో, గుర్రంపోడు



వరి పంటలో అగ్గితెగులు నుంచి కాపాడుకునేందుకు రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయ అధికారి కంచర్ల మాధవరెడ్డి తెలిపారు. బుధవారం 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ వరి సాగు, మండలంలో వ్యవసాయంపై వివరాలను తెలిపారు.

(ఆంధ్రజ్యోతి-గుర్రంపోడు)

ఆంధ్రజ్యోతి : మండలంలో ఎన్ని ఎకరాల్లో వరి సాగువుతోంది.

ఏవో: 14,150 ఎకరాల్లో వరి సాగు ఉంది.

ఆంధ్రజ్యోతి : వరి కాకుండా ఎలాంటి పంటలు వేస్తున్నారు?

ఏవో: మండలంలో వేరుశెనగ 450 ఎకరాల్లో సాగు జరుగుతుంది. మొక్కజొన్న కూడా 160 ఎకరాల్లో సాగవుతోంది

ఆంధ్రజ్యోతి : వరిలో ఎలాంటి తెగుళ్ల వ్యాపిస్తున్నాయి?

ఏవో: ప్రస్తుతం అగ్గి తెగులు వ్యాపిస్తోంది దీని నివారణకు ట్రైసోక్లోజిల్ 75 డబ్ల్యూపీ 150 గ్రాములు ఎకరానికి చొప్పున పిచికారీ చేయాలి. లేదా ఇసోప్రోథైలాన్ 300 ఎంఎల్ ఎకరానికి చొప్పున పిచికారీ చేయాలి.

ఆంధ్రజ్యోతి : అగ్గి తెగులు ఉన్నప్పుడు యూరియా చల్లవచ్చా?

ఏవో:యూరియా వాడకూడదు. పంట నష్టం సంభవించే అవకాశం ఉంది.

ఆంధ్రజ్యోతి : వరి పంటలో ఇంకా ఎలాంటి లోపాలు ఉన్నాయి?

ఏవో: వరిలో జింకు లోపం కూడా ఉంది. దీని నివారణకు జింకుచలామిన్ రెండు గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

వైభవంగా తిరుమలనాథుని కల్యాణం

● పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులు
● రాష్ట్ర స్థాయి ఎడ్లపందాల పోటీలు ప్రారంభం


కల్యాణాన్ని నిర్వహిస్తున్న ప్రధాన అర్చకుడు మురళీశర్మ, వేదపండితులు

తిరుమలగిరి(సాగర్), ఫిబ్రవరి 12 (ఆంధ్ర జ్యోతి): నల్లగొండ జిల్లా తిరుమలగిరి (సాగర్) మండలం కోనేటిపురం గ్రామ శివారులోని గుట్టపై వెలసిన శ్రీపద్మావతి సమేత తిరుమల నాథుని కల్యాణం బుధవారం వైభవంగా నిర్వహించారు. ప్రతి ఏటా మాఘ శుద్ధ పౌర్ణమి రోజు తిరుమలనాథ స్వామి కల్యాణం నిర్వహిచడం ఆనవాయితీ. పద్మావతి, తిరుమలనాథుల ఉత్సవ విగ్రహాలను గుట్టకింద కల్యాణ మండపం వరకు తీసుకురాగా ఆలయ ప్రధానార్చకుడు రాయ ప్రోలు మురళీశర్మ, వేదపండితులు శాస్త్రోక్తంగా కల్యాణం నిర్వహించారు. తిరు మలగిరి(సాగర్), పెద్దవూర, అనుముల మండలాలతో పాటు వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు జాతరకు తరలి వచ్చారు. జాతరకు విచ్చేసిన భక్తులకు రంగుండ్ల తండాకు చెందిన ఏసీపీ అంగోతు బాలాజీనాయక్, కుంకుడు చెట్టుతండాకు చెందిన డ్రగ్ ఇన్‌స్పెక్టర్ కృష్ణకుమార్ సహకారంతో అన్న వితరణ చేపట్టారు. ఆలయానికి సమీపంలో కొత్తగా నిర్మిం చిన పిరమిడ్ మహాక్షేత్రంలో మాజీ సీఎల్పీ కుందూరు జానారెడ్డి పలువురు నాయకులతో కలిసి కొద్దిసేపు ధ్యానం చేశారు. కార్యక్రమంలో జడ్పీ మాజీ వైస్ చైర్మన్ కర్నాటి లింగారెడ్డి, హాలి యా మార్కెట్ కమిటీ చైర్మన్ తుమ్మలపల్లి చంద్ర శేఖర్‌రెడ్డి, వైస్ చైర్మన్ కలసాని చంద్రశేఖర్, మాజీ ఎంపీపీ ఆంగోతు భగవాన్ నాయక్, కుందూరు వెంకట్ రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ కల్లూరు వెంకటేశ్వర్‌రెడ్డి, వెంపటి శ్రీనివాస్, రామకృష్ణ, సంజీవరెడ్డి, నాగరాజు, సభ్యులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి పూజలు

తిరుమలనాథ స్వామి జాతర సందర్భంగా నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి, మాజీ సీఎల్పీ నేత కుందూరు జానారెడ్డితో కలిసి ఆలయంలో పూజలు చేసి స్వామి వారి కల్యాణంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే నిలువెత్తు బెల్లంతో మొక్కును చెల్లించుకున్నారు. అనంతరం తెలం గాణ, ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాల స్థాయి ఎద్దుల పందాల పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జాతర సందర్భంగా రాష్ట్ర స్థాయి ఎద్దుల పందాలు నిర్వహిస్తుండడం అభినందనీయమన్నారు. రానున్న రోజుల్లో ఆలయ అభివృద్ధికి సహ కారం ఉంటుందని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

● మాడ్గులపల్లి :మండలంలోని కేశవాపురం గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు చల్లా రంగారెడ్డి ఇటీవల మృతిచెందారు.ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి బుధవారం గ్రామంలో కుటుంబ సభ్యులను పరామర్శించి తన సానుభూతి వ్యక్తం చేశారు. ఆయనతోపాటు శేఖర్‌రెడ్డి, మోహన్, భిక్షంరెడ్డి, సాయిలు, శ్రీనివాస్‌రెడ్డి, యాదగిరిరెడ్డి చంద్రారెడ్డి పాల్గొన్నారు.

ఈవ్ టీజింగ్‌లపై ఫిర్యాదులకు వెనకడొద్దు

మిర్యాలగూడ టౌన్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): ఈవ్ టీజింగ్‌లపై ఫిర్యాదు చేసేందుకు మహిళలు వెనుకాడొద్దని షీ టీమ్ ఏఎస్ఐ షరీఫ్ అన్నారు. స్థానిక కేఎస్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థినులకు బుధవారం షీ టీమ్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలికలు, మహిళల భద్రతే లక్ష్యంగా షీటీమ్ పనిచేస్తుందన్నారు. సామాజిక స్పృహ కలిగిన విద్యార్థినులు హాక్-ఐ యాప్ ద్వారా టీజింగ్‌లపై ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఫిర్యాదు దారుల వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. కళాశాల ప్రిన్సి పాల్ భీమార్జునరెడ్డి మాట్లాడుతూ విద్యార్థినులు అపరిచిత వ్యక్తులతో దూరంగా ఉండాలని సూచించారు. కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

నల్లగొండ, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): ఉద్యోగులు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని భార త ఆహార సంస్థ డివిజనల్ మేనేజర్ సునీల్ కుమార్ అన్నారు. ఎఫ్‌సీఐ జిల్లా కార్యాలయ లో బుధవారం హైదరాబాద్ యశోద ఆస్ప త్రి ఆధ్వర్యంలో ఉచిత కార్డియాలజీ మెడికల్ క్యాంపును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు నిత్యం ప ని ఒత్తిడికి గురవుతుంటారని, ఆరోగ్యంపై జా గ్రత్తలు తీసుకుంటే విధి నిర్వహణ సులువు గా సాగుతుందన్నారు. వైద్యు లు గురురాజు ప్రమోద్, వినయ్ పాల్గొన్నారు.

సమయపాలన పాటించాలి


సిబ్బందితో మాట్లాడుతున్న డాక్టర్ రామకృష్ణ

హాలియా,ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలని హాలియా పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రామకృష్ణ అన్నారు. మండలంలోని పేరూరు గ్రామ సబ్‌సెంటర్‌ను బుధవారం ఆయన సందర్శించారు. ఈసందర్భంగా ఇమ్యూనైజేషన్ సెషన్‌ను సందర్శించి ఆశ కార్యకర్తల, డ్యూలిస్ట్, ఈడీడీ, హైరిస్క్, పీఎన్‌సీ సెషన్‌సైట్ రిజిస్టర్లను తనిఖీ చేసి ఆశ కార్యకర్తలకు తగిన సలహాలు సూచనలు చేశారు. అనంతరం మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలను అందించాలని తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ వెంకటేశ్వర్లు, జ్యోతి, పాల్గొన్నారు.

ఐహెచ్‌ఆర్‌సీ జేసీగా రాజు

హాలియా, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిషన్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా హాలియా మున్సిపాలిటీకి చెందిన చవ్వాకుల వెంకటరమరాజు నియమితులయ్యారు. ఈసందర్భంగా బుధవారం ఐహెచ్‌ఆర్‌సీ ప్రెసిడెంట్ ఇండియా చాప్టర్ షేక్ గౌస్ రాజుకు నియామక పత్రాన్ని అందజేశారు.

తుది వరకు గెలుపు పోరాడితే విజయం

● డీఎస్పీ రాజశేఖర్‌రాజు ● మిషన్ పరివర్తన్ డివిజన్‌స్థాయి కబడ్డీ పోటీలు ప్రారంభం


క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడుతున్న డీఎస్పీ రాజశేఖర్‌రాజు

మిర్యాలగూడ, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ఆటలో తుది వరకు గెలుపు కోసం పోరాడితేనే విజయం సాధించే అవకాశం దక్కుతుందని అన్నారు. మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర్‌రాజు అన్నారు. జిల్లా పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన మిషన్ పరివర్తన్ యువతేజంలో భాగంగా స్థానిక క్లియో స్పోర్ట్స్ ఎరీనాలో డివిజన్ స్థాయి కబడ్డీ పోటీలను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటలు కేవలం శారీరక దృఢత్వం పెంచడమే కాకుండా గెలుపు కోసం ప్రత్యర్థి వేసే ఎత్తులకుపై ఎత్తులు వేయాలనే ఆలోచనలు మెదడకు పదును పెడతాయని అన్నారు. టీమ్ స్పిరిట్ విశ్వాసాన్ని పెంపొందిస్తుందని చెప్పారు. విద్యార్థులు ఆటల్లో ప్రతిభను కనబరుస్తూనే విద్యా విషయంలో ముందుకు సాగాలన్నారు. జిల్లా స్థాయిలో పోటీల్లో క్రీడాకారులు రాణించి డివిజన్ పోలీస్ శాఖకు పేరుతేవాలని అన్నారు. డివిజన్ స్థాయిలో 11 మండలాల జట్లు పోటీల్లో పాల్గొంటున్నాయి. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ ఎండీ యూసూఫ్, సీఐలు నాగార్జున, వీరబాబు, ఎస్ఐలు లోకేశ్, సైదిరెడ్డి, శేఖర్, ట్రాఫిక్ ఎస్ఐ శ్రీనివాస్, ఎంఈఓ బాలాజీ క్లియో స్పోర్ట్స్ వ్యవస్థాపకుడు ఏచూరి శ్రీనివాస్, ఎంపైర్లు తదితరులు పాల్గొన్నారు.

నేడు వివిధ పార్టీల నాయకులతో సమావేశం

చింతపల్లి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో వివిధ పార్టీల నాయకులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో సుజాత బుధవారం తెలిపారు. పోలింగ్ స్టేషన్ల ఏర్పాటుతో పాటు ఓటర్ల జాబితాలో ఉండే ఓటర్ల వివరాల కోసం ఈ సమావేశాన్ని నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.ఎన్నికల ప్రక్రియలో ప్రజలందరూ సహకరించాలని ఆమె సూచించారు.

అభివృద్ధిని చూసి కాంగ్రెస్‌లో చేరికలు

ఎమ్మెల్యే బాలునాయక్

దేవరకొండ, ఫిబ్రవరి, 12 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను చూసి వివిధ పార్టీల నా యకులు, కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరుతున్నారని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. మండలంలోని కమలాపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయ కులు అవపాటి లక్ష్మయ్య, నర్ర వెంకటయ్య, మాచర్ల శ్రీనివాస్, శోభన్‌బాబుతో పాటు మరో 20మంది కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరా రు. వారికి ఎమ్మెల్యే పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలు నాయక్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు.ఈ కార్య క్రమంలో ముక్కమల్ల వెంకటయ్య గౌడ్, జీవన్ రెడ్డి, రవికాంత్ రెడ్డి, సత్యం తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేయాలి


యూనియన్‌జెండాను ఆవిష్కరిస్తున్న కార్మికులు

మిర్యాలగూడ అర్బన్, ఫిబ్రవరి 12(ఆంధ్ర జ్యోతి): కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా యూనియన్ నాయకులు పని చేయాలని తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూని యన్(1104) డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎండీ షఫీఖాన్, నరేందర్‌రెడ్డి అన్నారు. ఈఈ యూ ప్లాటినమ్ జూబ్లీ ఉత్సవాల సందర్భంగా బుధవారం జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల హక్కుల కోసం సంస్థ నిర్విరామంగా పోరాడుతుందన్నారు. సంస్థ అభివృద్ధికి కార్మికులు సమష్టిగా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో సీతారాములు, గౌస్, మోతీలాల్, శేఖర్‌రెడ్డి, రామ్మూర్తి, కృష్ణ, రాంరెడ్డి, పర్వతాలు, ప్రసాద్, సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

రంగరాజన్ ఆచార్యపై దాడి చేసిన వారిని శిక్షించాలి


వినతిపత్రం అందిస్తున్న బ్రాహ్మణ సంఘం అర్చకులు

మిర్యాలగూడ, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి):చిలుకూరి బాలాజీ ఆలయ ప్రధాన అర్చకుడు రంగ రాజన్ ఆచార్యపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని బ్రాహ్మణ సంఘం నేతలు టి. నాగేందర్, వై.అనంతకృష్ణ కోరారు. ఈ మేరకు సబ్‌కలెక్టర్ కార్యా లయంలో డివిజనల్ పరి పాలనాధికారి శర్మకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సనాతన దర్మ పరిరక్షణకు అంకిత భావంతో పనిచేస్తూ భక్తులకు ఆధ్యాత్మిక చింతనను బోధిస్తున్న రంగరాజన్‌పై దాడికి పాల్పడడం అమానుషమన్నారు. హిందూ సంఘాలపేరుతో మూకను వెంటవేసుకొని వచ్చి భౌతికహింసకు పాల్పడటం హేయమన్నారు. సంఘటనకు బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలని, భవిష్యత్‌లో ఇలాంటి సంఘటన పునరావృతం కాకుండా చూడాలని కోరారు. అర్చకులు రాంమోహన్‌రావు, సాంబశివవర్మ, లక్ష్మీనారాయణ శర్మ,శబరీనాథ్‌శర్మ, సాంబయ్య శర్మ పాల్గొన్నారు.

చలి తీవ్రతతో వరిలో తెగుళ్లు


సుబ్బారెడ్డిగూడెంలో పొలాలను పరిశీలిస్తున్న ఏవో

మిర్యాలగూడ రూరల్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం రాత్రి వేళల్లో చలి తీవ్రత అధింగా ఉండడం వల్ల వరిలో తెగుళ్ల వస్తాయని మండల వ్యవసా యాధికారి ధీరావత్ సైదానాయక్ అన్నారు. మండలంలోని సుబ్బారెడ్డిగూడెం గ్రామంలో బుధవారం రైతులు సాగు చేసిన వరి పొలాలను ఆయన పరిశీలించి మాట్లాడారు. చలితీవ్రత వల్ల మెడవిరుపు తెగులు కూడా వచ్చే అవకాశాలు ఉన్నాయని, యూ రియా మోతాదును తగ్గించి నివా రణ చర్యల కింద ట్రైసైక్లోజోలు 0.6గ్రాములు, అజోస్ట్రోబిన్, మ్యాంగోజబ్ మందులను 2.5గ్రాములు పిచికారీ చేసుకోవాలన్నారు. కాం డంలో పురుగు అధికంగా ఉండడాన్ని గమనించి ఈ పురుగు నివారణకు కార్తప్ హైడ్రోక్లోరైడ్ 50 ఎస్‌పీ 1.5గ్రాములు, ఇన్సిపియో 0.6 ఎంఎల్ లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. ఈ లక్షణాలు అధిక యూరియా వాడడం వల్ల కూడా వస్తుందని రైతులకు సూచించారు. పొలాలు ఈత సమయంలో అధిక యూరియా వాడకూడదన్నారు. రైతులు రంగారెడ్డి, చంద్రారెడ్డి పాల్గొన్నారు.

'పది' పరీక్షలకు ప్రణాళిక రూపొందించాలి


విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న సీఐ నవీన్

చింతపల్లి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి):విద్యార్థులు పదోతరగతి పరీక్ష ల్లో ఉత్తమ ఫలితాల సాధన తగిన ప్రణాళిక రూపొందించుకోవాలని నాంపల్లి సీఐ నవీన్ సూచించారు. పీఆర్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలంలోని వెంకటేశ్వరనగర్ జడ్పీహెచ్ఎస్‌లో పదోతరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ఉత్తమ ఉపాధ్యాయులు చెప్పే పాఠ్యాంశాలు శ్రద్ధగా విని ఉత్తమ ఫలితాలు సాధించి ప్రతిభ చాటాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో పీఆర్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు చల్లం పాండురంగరావు, ప్రధానోపాధ్యాయుడు కృష్ణవేణి, మాజీ ఎంపీపీ కొండూరి భవాని పవన్‌కుమార్, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

లింగమంతుల స్వామి జాతర పోస్టర్ ఆవిష్కరణ

వేములపల్లి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లాలో ఈనెల 16 నుంచి నిర్వ హించనున్న లింగమంతుల స్వామి జాతర పోస్టర్‌ను మండల కేంద్రంలో మాజీ సర్పంచ్ చిర్ర మల్లయ్యయాదవ్ బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండేళ్లకోసారి జరిగే ఈ జాతరకు కులమతాలకు అతీతంగా అందరు పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో నాయకులు చేగొండి మురళీ యాదవ్, సైదులు, చిర్ర సాంబమూర్తి, జవ్వాజి సత్యనారాయణ, లక్ష్మయ్య, మల్లయ్య, కృష్ణ య్య, సతీష్, మట్టయ్య పాల్గొన్నారు.

బధిర విద్యార్థులకు అన్నదానం

కొండమల్లేపల్లి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : కొండమల్లేపల్లి సమీపంలోని జేత్యతండా వద్ద ఉన్న సాలిడార్ బధిరుల పాఠశాలలో బధిర విద్యార్థులకు యదాద్రి ఇన్‌ఫ్రా మేనేజింగ్ డైరెక్టర్ ముచ్చర్ల శ్రీకాంత్ యాదవ్, మిరాకిల్స్ టీమ్ అధ్యక్షుడు జక్క విష్ణు వర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో అన్న వితరణ నిర్వహించారు.యాదాద్రి ఇన్‌ఫ్రాసభ్యులు రేణుక, సత్యనారాయణ, లక్ష్మయ్య పాల్గొన్నారు.

అంగన్‌వాడీల బలోపేతానికి కృషి చేయాలి

చింతపల్లి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతానికి టీచర్లు కృషి చేయాలని ఐసీడీఎస్ సీడీపీఓ సక్కుబాయి తెలిపారు. మండలంలోని ధైర్యపురితండా అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం చిన్నారులకు అక్షరాభ్యాసం చేశారు. కార్యక్రమానికి ఆమె పాల్గొని మాటాడారు. అంతకుముందు కుర్మేడ్, గొల్లపల్లి అంగన్వాడీ కేంద్రాలను క్షేత్ర స్థాయిలో తనిఖీ నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్ వైజర్ బోదాసు పార్వతి, టీచర్లు సంతోష, పాల్గొన్నారు.

సరోత్తంరెడ్డికి మద్దతుగా ప్రచారం

పెద్దవూర, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): వరంగల్, ఖమ్మం, నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి పులి సరోత్తంరెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి అన్నారు. బుధవారం పెద్దవూర మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారం కావాలంటే సరోత్తంరెడ్డికి గెలిపించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో హరీష్, కాసం వెంకటేశ్వర్లు, ం కంకణాల శ్రీధర్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి కంకణాల నివేదితరెడ్డి, ఎమ్మెల్సీ ఇన్‌చార్జి పాపయ్య, నాయకులు పాల్గొన్నారు.

● ఎమ్మెల్సీ అభ్యర్థి సర్వోత్తమరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఆ పార్టీ రాష్ట్ర కార్య వర్గ సభ్యుడు నూకల నర్సింహారెడ్డి అన్నారు. దేవరకొండలో బుధవారం ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు.

ఉపాధ్యాయుల సంక్షేమానికి పనిచేస్తా : గోపాల్‌రెడ్డి

నాగార్జునసాగర్,ఫిబ్రవరి12(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు ఎమ్మెల్సీ ఎన్నికల్లో చైతన్యంతో ముందుకు సాగాలని వరంగల్-ఖమ్మం-నల్లగొండ ఉపా ధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి గోపాల్‌రెడ్డి పన్నాల అన్నారు. బుధవారం ఆయన సాగర్ హిల్ కాలనీలో ఎన్నికల ప్రచారం అనంతరం విలేకరులతో మాట్లాడారు. తనను ఎమ్మెల్సీగా గెలిపిస్తే రాష్ట్రంలో ఉపా ధ్యాయ, విద్యరంగ సంక్షేమం కోసం పని చేస్తానని శాసన మండలిలో ఉపాధ్యాయ గొంతుక వినిపించి, ప్రభుత్వాన్ని ప్రశ్నించి ఉపాధ్యాయుల సమస్యల కోసం తన వంతుగా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో పులి పాపయ్య, గుండెబోయిన నాగేశ్వర్‌రావు, వెంకట్‌రెడ్డి, పవన్ పాల్గొన్నారు.

మాజీ ప్రిన్సిపల్ మోహన్‌రెడ్డికి నివాళి

దేవరకొండ, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): దేవరకొండ మునగాల కొండల్‌రావు డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్‌గా పనిచేసిన కుంభం మోహ న్‌రెడ్డి ఈనెల 11న నల్లగొండలో అనా రోగ్యంతో మృతి చెందారు. మోహ న్‌రెడ్డి దేవరకొండ మునగాల కొండల్‌రావు డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్‌గా 2019 నుంచి 2021 వరకు పనిచేసి కళాశాల అభివృద్ధికి కృషి చేశారు. ఈ సందర్భంగా బుధవారం మోహన్‌రెడ్డి చిత్రపటానికి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రవి, అధ్యాపకులు పూలమాల వేసి నివా ళుల ర్పించారు. కార్యక్ర మంలో వైస్ ప్రిన్సిపల్ పృధ్వి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

లంబాడీల ఐక్య వేదిక రాష్ట్ర ఇన్‌చార్జిగా కృష్ణనాయక్

మిర్యాలగూడ టౌన్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): లంబాడీల ఐక్య వేదిక రాష్ట్ర ఇన్‌చార్జి బానావత్ కృష్ణనాయక్ నియమి తులయ్యారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. లంబా డీల హక్కుల సాధనకు కృషిచేస్తానని, గిరిజనులను ఏకతాటిపైకి తెచ్చేందుకు తన వంతు ప్రయత్నం చేస్తానన్నారు.